



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 306 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శనివారం 12 జూలై 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :306 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SAT 12 JULY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై ఫోకస్ పెట్టాం

- మన దేశానికి అతిపెద్ద ఆర్థిక వనరు జనాభానే అన్న చంద్రబాబు
- అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతమేనన్న సీఎం
- జనాభా పెరుగుదలను తాను సమర్థిస్తున్నానని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**మన దేశానికి అతి పెద్ద ఆర్థిక వనరు జనాభా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో జనాభా పడిపోతోందని చెప్పారు. అతి ఎక్కువ జనాభా ఉన్న దేశం భారతదేశం అని అన్నారు. మన దేశ జనాభా 143 కోట్లు కాగా... చైనా జనాభా 130 కోట్లు అని చెప్పారు. అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతం మాత్రమేనని.... 2.1 శాతం ఫర్టిలిటీ రేటు ఉంటేనే రీప్లేస్ మెంట్ ఉంటుందని... లేకపోతే రోజురోజుకూ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. మన దేశంలో బీహార్ లో ఫర్టిలిటీ రేటు 3 శాతంగా ఉందని, ఏపీలో 1.7 శాతానికి చేరుకుందని చెప్పారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారని... ఇప్పుడు ఎక్కువ జనాభా ఉన్న దేశాలకు గౌరవం దక్కుతోందని చంద్రబాబు అన్నారు. గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే... స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు లేదనే చట్టాన్ని తాను తీసుకొచ్చానని... ఇప్పుడు జనాభా పెరుగుదలను తానే సమర్థిస్తున్నానని చెప్పారు.

రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై దృష్టి సారించామని తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవ సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి



- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్
- టీటీడీలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్న
- వారిని ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్

వివరాలు 2లో..

## ఢిల్లీలో మరోసారి భూకంపం.. పరుగులు పెట్టిన జనం



**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీలో మరోసారి భూకంపం వచ్చింది. శుక్రవారం(జూలై11) ఢిల్లీ -ఎన్ సీఆర్ లో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో జనం ఇండ్లలోంచి బయటికి పరుగులు పెట్టారు. భూకంప హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని నేషనల్ సెంటర్ ఆఫ్ సిస్మోలజీ (NCS) తెలిపింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ వారంలో ఈ ప్రాంతాన్ని తాకిన రెండవ భూకంపం ఇది. గురువారం కూడా దేశ రాజధాని ఢిల్లీలో భూకంపం జనానాలను భయభ్రాంతులకు గురి చేసింది. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, భివానీ, ఝజ్జర్, బహదూర్‌గఢ్ సహా అనేక నగరాల్లో భూకంప ప్రకంపనలు సంభవించాయి. భూకంపం హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైనట్లు అధికారులు అంచనా వేశారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది

- ఏపీ వ్యాప్తంగా నిన్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 2.0
- అందరికీ కృతజ్ఞతలు తెలిపిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ఇలాంటి కార్యక్రమాలో విద్యార్థుల భవితకు బంగారు బాట వేయొచ్చని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0' కార్యక్రమం విజయవంతం అయిందని చెబుతూ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు.

వివరాలు 2లో..

## ట్రంప్ కొత్త బిల్లు ఎఫెక్ట్.. భారతీయ విద్యార్థులకు, టూరిస్టులకు అమెరికా షాక్!

- నాన్ ఇమ్మిగ్రేషన్ వీసాల ఫీజును పెంచిన ట్రంప్ ప్రభుత్వం
- రూ. 16 వేల నుండి రూ. 40 వేలకు పెరిగిన టూరిస్ట్ వీసా ఫీజు
- యూఎస్ వీసా ఇంటిగ్రిటీ ఫీజు కింద 250 అమెరికన్ డాలర్లు చెల్లించాలి



**పెన్ పవర్ డెస్క్:**అమెరికా వెళ్లాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం షాకిచ్చింది. వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు యాక్ట్ కింద నాన్-ఇమిగ్రేషన్ వీసాల ఫీజును పెంచింది. ఈ ఫీజును రూ. 26 వేలకు పెంచింది. అమెరికా వెళ్లాలనుకునే భారతీయులకు కూడా ఈ ఫీజు వర్తిస్తుంది.

వివరాలు 2లో..

## నా తండ్రి నాకు ఇచ్చిన ఆస్తి ఇదే

- చదువుకు మించిన ఆస్తి లేదన్న అనిత
- తన తండ్రి తనకు ఇచ్చిన ఆస్తి చదువేనని వెల్లడి
- అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన



**పెన్ పవర్ డెస్క్:**సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, తప్పుడు పోస్టులు పెట్టేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటు న్నామని ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సామాజిక మాధ్యమాల పట్ల పిల్లలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరినీ తల్లిదండ్రులు సమానంగా చూడాలని అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వివరాలు 2లో..

## హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు
### ఏపీ డిప్యూటీ సీఎం పవన్





- వ్యాపారాలకేమో హిందీ కావాలి... మరి హిందీ నేర్చుకోవడానికి ఇబ్బంది ఏంటి?: పవన్ కల్యాణ్
- హైదరాబాదులో రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకలు
- హాజరైన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- హిందీ దేశ భాష అని వెల్లడి
- హిందీ నేర్చుకుంటే మరింత బలపడతామని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాష యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఐటీ రంగంలో విజయం సాధించడానికి ఆంగ్లం ఎంత ముఖ్యమో, దేశంలో ఎక్కువ మంది మాట్లాడే హిందీని నేర్చుకోవడం వల్ల కూడా అంతే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దక్షిణ భారతీయ సినిమాలలో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం వస్తుందని గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ అవసరమైనప్పుడు, నేర్చుకోవడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.

వివరాలు 2లో..

## లిక్కర్ స్కామ్ లో వాస్తవాలు దేశం నివ్వెరపోయేలా ఉన్నాయి

- సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్న పయ్యావుల
- ఐఐటీ ప్రొఫెషనల్స్ తో బాక్సులకు బాక్సుల డబ్బులు తరలించారని ఆరోపణ
- బుగ్గన బుర్రకథలు ఆపాలని హితవు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ పై రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్యం కుంభకోణానికి సంబం ధించి సిట్ దర్యాప్తులో సంచలన విషయా లు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. లిక్కర్ స్కామ్ లో ఐఐటీ ప్రొఫెషనల్స్, ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని బాక్సులకు బాక్సుల డబ్బులు తరలించారని ఆరోపిం చారు. యావత్ దేశం నివ్వెరపోయేలా లిక్కర్ స్కామ్ లో వాస్తవాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఉదయ్ భాస్కర్ రెడ్డి దాదాపు 200 తప్పుడు మెయిల్స్ పెట్టాడని... ఆయనపై కేసులు పెట్టి తీరతామని అన్నారు. బంగారుపాళ్యంలో

వివరాలు 2లో..

## టీడీపీ వాళ్లేమో ఒక్కొకరిని కంటారు..
### అందరికీ ఇష్టం వచ్చినట్లు కనమని చెబుతారు




**పెన్ పవర్ డెస్క్:**జనాభా నిర్వహణ గురించి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. గతంలో జనాభా నియంత్రణను పెద్దఎత్తున ప్రోత్సహించిన చంద్రబాబు.. ఇప్పుడు ముగ్గురికంటే ఎక్కువమంది పిల్లలను కంటేనే నిజమైన దేశభక్తి అంటూ కామెంట్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. చంద్రబాబు వ్యాఖ్యలపై స్పందించిన వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని తనదైన స్టైల్ లో కౌంటర్ ఇచ్చారు. టీడీపీ వాళ్లేమో ఒకరిని కంటారు.. అందరికీ ఇష్టం వచ్చినట్లు

వివరాలు 2లో..

## సిద్ధరామయ్యను అవమానిస్తారా?
### రాహుల్ గాంధీపై బీజేపీ ఆగ్రహం

- ఢిల్లీకి వచ్చిన సిద్ధరామయ్యకు దొరకని రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్
- సొంత పార్టీ నేత, సీఎంను అవమానించారని బీజేపీ విమర్శలు
- గాంధీ కుటుంబం కర్ణాటక కాంగ్రెస్ నేతలను గతంలోనూ అవమానించిందని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**సొంత పార్టీకి చెందిన ముఖ్య మంత్రి సిద్ధరామ య్య ఢిల్లీకి వచ్చి అపాయిం ట్‌మెంట్ కోరితే కలవ కుండా అవమానిస్తారా? అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్ణాటకలో కొంతకా లంగా అధికార

వివరాలు 2లో..

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ట్విస్ట్... విచారణకు హాజరైన రజత్ భార్గవ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈరోజు కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసును విచారిస్తున్న సిట్ అధికారుల నుంచి నోటీసులు అందుకున్న నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, మాజీ ఐఏఎస్ రజత్ భార్గవ విచారణకు హాజరయ్యారు. తనతో పాటు తన హెల్త్ కండిషన్ కు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకున్నారు. మరోవైపు, ఈనాటి సిట్ విచారణకు హాజరుకాలేనని ఉదయం ఆయన విచారణాధికారులకు సమాచారం పంపించారు. తన ఆరోగ్యం బాగోలేదని తెలిపారు. అయినప్పటికీ విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని సిట్ స్పష్టం చేయడంతో ఆయన విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే సిట్ అధికారులు ఈ కేసులో పలువురిని విచారించి, అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

- సిట్ విచారణకు హాజరైన మాజీ ఐఏఎస్ రజత్ భార్గవ
- విచారణకు హాజరుకాలేనని ఉదయం సమాచారం పంపిన వైనం
- తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేసిన సిట్ అధికారులు

## ఎడిటర్ వ్యూ

## జగన్ ఆ హామీ ఇస్తేనే మళ్లీ గెలుపట.. లేకుంటే క్యాడర్, లీడర్ వెనకడుగే

వైసీపీ అధినేత వైఎస్ జగన్ గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకుంటానని ముందు చెప్పాల్సి ఉంటుంది. అప్పుడే నేతల్లో కాస్త ధైర్యం కలుగుతుంది. 2019 ఎన్నికల్లో తొలి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఆయన ఓటమికి కారణాలయ్యాయి. అందుకే గతంలో తీసుకున్న నిర్ణయాలు మళ్లీ అధికారంలోకి వస్తే అమలుచేయబోనన్నహామీ జగన్ నుంచి స్పష్టంగా రావాల్సి ఉంటుంది. అప్పటి వరకూ కార్యకర్తలు, లీడర్లు వచ్చినప్పటికీ ఇంకా రెట్టించిన ఉత్సాహంతో మాత్రం పనిచేయరు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు పార్టీ నేతలతో పాటు కార్యకర్తలను కూడా ఐదేళ్ల పాటు ఇబ్బంది పెట్టాయి.

**కనెక్షన్ కట్ చేసి...**

ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశాడు. అసలు ఎమ్మెల్యేలకు, ప్రజలకు మధ్య సంబంధం లేకుండా జగన్ తానే ఒంటిచేత్తో రాష్ట్రాన్ని నడిపించాలన్న బిల్డప్ ఇచ్చేశాడు. బటన్ నొక్కుతున్నాను కదా? ఈవీఎంలో కూడా ఫ్యాన్ పై నొక్కుతారని భ్రమించి అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పుడువైసీపీ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. కేవలం వారు మనసులో దాచుకోవడం లేదు. వచ్చే ఎన్నికల తర్వాత జగన్ తన తీరును మార్చుకోవాలని కూడా నేతలు సూచిస్తున్నారంటే నేతలు ఏ మాత్రం హర్ట్ అయ్యారో వేరే చెప్పాల్సిన పనిలేదు. తాజాగా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి.

**వాలంటీర్ల వ్యవస్థను...**

జగన్ వాలంటీర్ల వ్యవస్థను దూరం పెట్టాలని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. తాను కూడా ఈ విషయాన్ని జగన్ కు ఎప్పుడో చెప్పానంటూ ఆయన అన్నారు. అంటే వాలంటీర్ల వ్యవస్థ పార్టీని ఎంత డ్యామేజీ చేసిందో జగన్ కు ఈ పాటికి అర్థమయి ఉండాలి. కార్యకర్తలకు పనులు అప్పజెప్పాల్సిన జగన్ వాలంటీర్లను తీసుకుని వారి నెత్తిపై పెట్టడంతో ఇటు కార్యకర్తలు, అటు ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ పెరిగిపోయింది. ప్రజలకు కూడా అసలు వైసీపీ నేతలను సంప్రదించాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో స్థానిక నాయకత్వానికి, ప్రజలకు మధ్య కనెక్షన్ కట్ అయింది. ఈ కారణంగానే గత ఎన్నికల్లో ప్రజల వద్దకు వాలంటీర్లు వెళ్లలేదు. కార్యకర్తలు వెళ్లలేదు. ఫలితంగా పదకొండు సీట్లకే పరిమితమవ్వాల్సి వచ్చింది.

**మద్యం దుకాణాల విషయంలోనూ...**

ఇక మద్యం దుకాణాల విషయంలోనూ జగన్ ది తప్పుడు నిర్ణయమేనని వైసీపీనేతలు బాహాటంగా చెబుతున్నారు. ఎప్పుడూ లేనిది చరిత్రలో తొలిసారి ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహించడమేంటని, ఆ దుకాణాలు ఉంటే వేలంలో తాము సాధించుకుని పదో పరకో సంపాదించుకునే అవకాశాన్ని కూడా జగన్ పోగొట్టారని ద్వితీయ శ్రేణి నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ అధికారంలోకి రావడానికి తమ జేబు నుంచి డబ్బులు తీసి ఖర్చు పెట్టుకున్నా తర్వాత ఐదేళ్ల పాటు సంపాదించుకునే మార్గం లేక ఆర్థికంగా నష్టపోయామన్న ఆవేదన అందరిలోనూ ఉంది. అందుకే జగన్ తొలుత వాలంటీర్లు, మద్యం దుకాణాలపై తన విధానాన్ని చెప్పాలని వైసీపీ నేతలే ప్రశ్నించడం ఇప్పుడు పార్టీ నాయకత్వానికి మింగుడుపడటం లేదు.

# టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి

టీటీడీలో అన్యమతాలకు చెందిన ఉద్యోగులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆ ఆనవాయతీని ఎందుకు కొనసాగిస్తున్నారని అన్నారు. అన్యమతస్తులను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తిరుమల వచ్చారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కరీంనగర్ లో ఇప్పటికే భూమిపూజ చేసిన స్థలంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వెంటనే నిర్మించాలని బండి సంజయ్ కోరారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. సనాతనధర్మ పరిరక్షణ కోసం అందరూ కలసికట్టుగా ఉండాలని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ధూపదీప నైవేద్యాలకు నోచుకోలేని పురాతన ఆలయాలను గుర్తించి, టీటీడీ నిధులను కేటాయించి వాటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నానని అన్నారు. కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట రామాలయం ఆలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు.
ఇతర మతస్తులు టీటీడీలో పనిచేస్తున్నందునే ఆచార వ్యవహారాల్లో తేడా వస్తోందని సంజయ్ అన్నారు.
స్వామిపై నమ్మకంలేని వ్యక్తులకు జీతాలిచ్చి ఎందుకు పోషిస్తున్నారని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు సరికాదని అన్నారు. బొట్టు పెట్టుకుని వెళితే మసీదులు, చర్చిల్లో ఉద్యోగాలు ఇస్తారా అని ప్రశ్నించారు.

## ట్రంప్ కొత్త బిల్లు ఎఫెక్ట్.. భారతీయ విద్యార్థులకు, టూరిస్టులకు అమెరికా షాక్!

- మొదటి పేజీ తరువాయి

అమెరికా పర్యటనకు, ఉన్నత విద్యకు, ఉద్యోగం కోసం వెళితే ఈ ఫీజును చెల్లించవలసి ఉంటుంది. టూరిస్ట్ వీసా ఫీజును రూ. 16 వేల నుంచి రూ. 40 వేలకు పెంచింది. యూఎస్ వీసా ఇంటిగ్రిటీ ఫీజు కింద 250 అమెరికన్ డాలర్లను చెల్లించవలసి ఉంటుంది. అంటే రూ. 21,400 చెల్లించాలి. ఈ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరు. దీనికి అదనంగా సర్‌ఛార్జీని వసూలు చేస్తారు. వీసా జారీ చేసే సమయంలో ఈ మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది.
బీ1, బీ2 (టూరిస్ట్ అండ్ బిజినెస్ వీసాలు), ఎఫ్ అండ్ ఎం (విద్యార్థి వీసాలు), హెచ్1బీ (వర్క్ వీసా), జే (ఎక్స్చేంజ్ విజిటర్ వీసా) వీసాలకు ఈ మొత్తం చెల్లించవలసి ఉంటుంది. డిప్లొమాటిక్ వీసా కలిగిన వారికి మాత్రం దీని నుంచి మినహాయింపు ఇచ్చింది. విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పర్యాటకులు, వ్యాపారం కోసం ప్రయాణాలు చేసే వారిపై ఈ ఫీజుల ప్రభావం పడనుంది.బీ2 టూరిస్ట్ వీసా ఖర్చు ప్రస్తుతం రూ. 15 వేలుగా ఉంటే, ఇప్పుడు అదనంగా ఇంటిగ్రిటీ ఫీజు కింద రూ. 21 వేలు చెల్లించవలసి ఉంటుంది. దీంతో మొత్తం ఖర్చు రూ.35 వేలు దాటుతుంది. హెచ్1బీ వీసా ధర ఇప్పటి వరకు స్వల్పంగా ఉంది. కానీ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ప్రకారం భారీగా పెరిగింది.ఇదిలా ఉండగా, వీసా ఇంటిగ్రిటీ ఫీజును కొన్ని సందర్భాలలో వెనక్కి ఇస్తారు. వీసా హోల్డర్ అమెరికాలో ఉన్న సమయంలో ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే తిరిగి ఇస్తారు. అలాగే ఐ-94 గడువు ముగియడానికి ఐదు రోజుల కంటే ముందుగా అమెరికాను విడిచి వెళ్లిన వారికి కూడా చెల్లిస్తారు.ఈ వీసా ఫీజుల పెంపు 2026 సంవత్సరం నుంచి అమలులోకి రానుంది.

## లిక్కర్ స్కామ్ లో వాస్తవాలు దేశం నివ్వెరపోయేలా ఉన్నాయి

- మొదటి పేజీ తరువాయి

జగన్ పర్యటన సందర్భంగా ట్రాక్టర్ ల నుంచి బలవంతంగా మామిడికాయలు కింద పారబోశారని మండిపడ్డారు. ట్రాక్టర్ లాక్కొచ్చి చేసిన ట్రిక్స్ డ్రోన్ కెమెరాల్లో బయటపడ్డాయని తెలిపారు. వైసీపీలో అస్తిత్వం కోసం బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని... వెటకారం తగ్గించుకోవాలని, ఇప్పటికైనా బుర్రకథలు ఆపాలని హితవు పలికారు. జగన్ రోడ్డు మీదకు వస్తే తలకాయలు కానీ, మామిడికాయలు కానీ పగలాల్సిందేనని చెప్పారు.

## టీడీపీ వాళ్లేమో ఒక్కొకరిని కంటారు.. అందరికీ ఇష్టం వచ్చినట్లు కనమని చెబుతారు

- మొదటి పేజీ తరువాయి

కనమని చెబుతారంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ వాళ్ళు ముందు పిల్లల్ని కనాలని.. ఆ తర్వాత ఫ్యామిలీ ప్లానింగ్ గురించి మాట్లాడాలని అన్నారు పేర్ని నాని. రాష్ట్రంలో పోలీసులు రెడ్ బుక్ కోసం మాత్రమే పనిచేస్తున్నారని.. లా అండ్ ఆర్డర్ కోసం పనిచేయటం లేదని మండిపడ్డారు పేర్ని నాని. రాష్ట్రంలోని ఆకృత్యాలలో భాగమే కాకినాడ ఘటన అని.. కాకినాడ లైంగిక వేధింపుల ఘటన పోలీసుల పనితీరుకు అద్దం పడుతుందని అన్నారు. ఇదిలా ఉండగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హిందీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు పేర్ని నాని. తెలుగు అమ్మ వంటిది, హిందీ పెద్దమ్మ వంటిది అంటూ పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ కి కౌంటర్ ఇచ్చారు పేర్ని నాని. పవన్ కళ్యాణ్ మోదీని తిడితే అందరూ తిట్టాలా, ఆయన హిందీ నేర్చుకోవాలంటే అందరూ నేర్చుకోవాలా, మరో పదేళ్లు చంద్రబాబును మోయాలి అంటే అందరూ మోయాలా అంటూ ప్రశ్నించారు పేర్ని నాని.

## హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు

- మొదటి పేజీ తరువాయి

తన సినిమాలో "ఏ మేరా జహా" అనే హిందీ పాట పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ, మాతృభాష తెలుగు అయినప్పటికీ, హిందీ దేశ భాష అని చెప్పడానికే అలా చేశానని తెలిపారు.
హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోవడం కాదని, మరింత బలపడటమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మరో భాషను అంగీకరించడం ఓటమి కాదని, కలిసి ప్రయాణించడమని ఆయన ఉద్ఘాటించారు. విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి వంటి రంగాలలో భాషా అవధులు చెరిగిపోతున్న ఈ సమయంలో హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.
తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి మాతృభాషల పట్ల గౌరవం ఉండాలని చెబుతూనే, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణించారు. ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృభాష ఉండగా, దేశ సరిహద్దులు దాటితే హిందీ రాజ్య భాషగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం విడిపోవడానికి కారణాలు వెతుకుతుంటే, భారతదేశం మాత్రం ఒకే భాషతో ఏకం కావాలని చూస్తోందని, అది హిందీతో సాధ్యమవుతుందని ఆయన అన్నారు.
ఒక బెంగాలీ గీతం జాతీయ గీతమైందని, ఒక పంజాబీ దేశం కోసం పోరాడారని, రాజస్థాన్‌కు చెందిన రాణప్రతాప్ శౌర్యానికి చిహ్నంగా నిలిచారని, తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ అయ్యారని, మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన వ్యక్తి రూపొందించిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి భాషా జీవ భాష, మాతృ భాష అయినప్పటికీ, రాజ్య భాష మాత్రం హిందీయేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది

- మొదటి పేజీ తరువాయి

సమాజం స్వచ్ఛందంగా అందించిన మద్దతు విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడం, విద్యార్థుల ప్రగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.'మెగా పీటీఎం 2.0' ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించడం జరిగిందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి, వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా, వారి భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను మరింత క్రియాశీలం చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## నా తండ్రి నాకు ఇచ్చిన ఆస్తి ఇదే

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.
తాను ఒకప్పుడు టీచర్ అని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడతానని అనిత అన్నారు. తన తండ్రి తనకు ఇచ్చిన ఆస్తి చదువు అని తెలిపారు. చదువుకు మించిన ఆస్తి లేదని చెప్పారు. కనిపించే దేవత అయిన అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. తమ ప్రభుత్వంలో తల్లిదండ్రులు అందరూ చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని చెప్పారు. జగన్ పాలనలో గంజాయి ఏరులై పారేదని విమర్శించారు.
తమ ప్రభుత్వంలో గంజాయి కేసుల్లో పట్టుబడితే సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ గా మార్చుదామని పిలుపునిచ్చారు. గంజాయి మత్తులో పిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## సిద్ధరామయ్యను అవమానిస్తారా?

- మొదటి పేజీ తరువాయి

మార్పిడిపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ఢిల్లీకి వచ్చారు. రాహుల్ గాంధీని కలవాలని ప్రయత్నించగా ఆయనకు అపాయింట్‌మెంట్ లభించలేదు.ఈ అంశంపై బీజేపీ స్పందిస్తూ, "మీ పార్టీ నేత, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మిమ్మల్ని కలిసేందుకు ఢిల్లీ వరకు వస్తే ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానిస్తారా?" అని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నాయకులను గాంధీ కుటుంబం అవమానించడం ఇదే మొదటిసారి కాదని ఆయన ఆరోపించారు.
గతంలో వీరేంద్ర పాటిల్‌ను రాజీవ్ గాంధీ అప్రజాస్వామికంగా ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించి అవమానించారని ఆయన గుర్తు చేశారు.ఇప్పుడు సిద్ధరామయ్యపై కుట్ర పన్ని డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పీఠాన్ని లాక్కోవాలని చూస్తున్నప్పటికీ, రాహుల్ గాంధీ మాత్రం ఈ విషయంపై ఆయనతో చర్చలు జరపడానికి అవకాశం ఇవ్వకుండా అవమానించారని విమర్శించారు. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమయ్యారు. అయితే, సిద్ధరామయ్యకు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ మాత్రం లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది

## ఒడిశాలో అమానుష ఘటన..కొత్త జంటకు తాలిబన్ తరహా శిక్షలు.. ఘోరంగా హింసించారు

పెళ్లి చేసుకోవడమే వారు చేసిన తప్పు. యువ జంట వివాహం స్థానిక ఆచారాలకు విరుద్ధం అని పాశవికంగా దాడి చేశారు. వీరి కలయిక సమాజంలో నిషిద్ధం అంటూ ఘోరమైన శిక్షలు వేశారు. అవమానించారు. ఆధునిక యుగంలోకూడా ఇలాంటి ఘటనలు కలవరం చేపుతున్నాయి. ఒడిశాలోని రాయగడ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. అది ఒడిశాలోని రాయగడ జిల్లాలోని కంజామఝిరా గ్రామం.. ఈ గ్రామంలో ఓ యువ జంట స్థానిక ఆచారాలకు విరుద్ధంగా వివాహం చేసుకున్నారని దారుణమైన శిక్షను ఎదుర్కొన్నారు. స్వయాన అత్తకొడుకున్న పెళ్లాడిన యువతికి ఘోర అవమానం, దారుణమైన శిక్ష. అక్కడి సాంప్రదాయ నమ్మకాల ప్రకారం.. వారిది దగ్గర సంబంధంగా భావిస్తారు. వారిద్దరి కలయిక నిషిద్ధం. వివాహం చట్టబద్ధమైనప్పటికీ ఈ సంబంధం తోటి గ్రామస్తుల నుంచి తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కొంది. వారు ఈ సంబంధాన్ని ఆమోదయోగ్యం కాని ఆచార ఉల్లంఘనగా భావించారు.

**ఎద్దుల్లా పొలం తున్నించారు..**

ఆచారం ప్రకారం.. వారు చేసింది తప్పు కాబట్టి శిక్ష అనుభవించాల్సిందే అని గ్రామస్థులు అవమానకరమైన దారుణమైన రీతిలో ప్రవర్తించారు. ఆ జంటను బహిరంగంగా అవమానపర్చారు. వారిని వెదురు ,చెక్క దుంగలతో తయారు చేసిన కాడికి కట్టారు. ఇది ఎద్దులు దున్నడానికి ఉపయోగించే కాడి లాంటిది. ఎద్దులా వారితో పొలం దున్నించారు. దీనికి సబంధించిన వీడియో వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న వీడియోలో ఆ యువజంట ఎద్దుల్లా నాగలి లాగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గ్రామస్తులు అంతా చుట్టూ చేరి వారిని హింసిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ దృశ్యం తాలిబన్ తరహా శిక్షలను పోలి ఉందని , ఇది అమానవీయ రీతిలో ఉందని గ్రామస్తులు ప్రేక్షకుల్లా చూడడం దారుణం అని నెటిజన్లు మండిపడుతున్నారు.

**బహిరంగ అవమానం తర్వాత శుద్ధీకరణ ఆచారం..**

బలవంతంగా పొలం దున్నిన తర్వాత ఆ జంటను గ్రామ మందిరానికి తీసుకెళ్లారు. అక్కడ పెద్దలు వారిచే శుద్ధి కర్మలు చేయించారు. సామాజిక నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా ఆ జంట చేసిన 'పాపం'ను శుద్ధి చేయడానికి ఈ చర్యలు తీసుకున్నాం అంటున్నారు గ్రామస్తులు. ఈ శిక్ష వారిని అవమానపరచడమే కాకుండా వారి ధిక్కార తర్వాత వారిని సమాజంలో తిరిగి చేర్చడానికి కూడా ఉద్దేశించబడినవి అని సమర్థించుకున్నారు గ్రామస్తులు.
ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది.కార్యకర్తలు , పౌర సమాజ సంఘాలు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు . ఇటువంటి అనాగరిక, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు

## ఫుడ్ కమిషన్ ఆకస్మిక తనిఖీ



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 11 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ సి.హెచ్ విజయ ప్రతాప్ రెడ్డి, మెంబర్ జే.కృష్ణ కిరణ్ జిల్లాలో ఆకస్మిక పర్యటనలు చేసి తణుకు, తాడేపల్లిగూడెం మండలాల్లో ఉన్న ఒక యం.యల్.యస్ పాయింట్, మూడు రేషన్ షాప్ లు, పది అంగన్వాడీ కేంద్రాలు, ఐదు మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలు, మూడు సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లు, గురుకులాలు, మూడు బి.సి వెల్ఫేర్ హాస్టల్‌లు గురుకులాల్లో భోజనం, వసతి ఇతర సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించారు. వాటిని బలోపేతం చేయడానికి సంబందిత అధికారులకు సూచనలు జారీ చేశారు. విద్యార్దులకు అందిస్తున్న భోజనం, ఫలహారాల పై విద్యార్దుల అభిప్రాయ సేకరణ చేశారు . రోజువారీ మెనూలో కొన్ని మార్పులను సూచించారు. అలాగే 10 వ తరగతి విద్యార్థులు గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రత్యేకంగా ట్యూషన్ టీచర్లను నియమించెందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలో టిఫిన్ లో ఉప్మా కు బదులు ఎగ్ ఫ్రైడ్ రైస్ పెట్టాలని సూచించారు.

## వైభవంగా చెముడులంక ధనలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవం

**ఆలమూరు, పెన్ పవర్,జూలై 11 :** ఆలమూరు మండలం చెముడులంక జాతీయ రహదారిపై వేంచేసి ఉన్న ధనలక్ష్మి అమ్మవారి జాతర తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం రాత్రి ఈ అమ్మవారి జాతరను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఈ జాతర ఉత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్,ఆ గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ అలంకరణ లతో తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.నిత్యం రద్దీగా ఉండే నాలుగులైన్ల





జాతీయ రహదారి పక్కన ఈ ఉత్సవం జరుగుతుండడంతో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రావుల పాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై నరేష్‌లు తమ సిబ్బందితో దగ్గరుండి బందోబస్తు నిర్వహించారు. అలాగే శుక్రవారం ఉదయం నుంచి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

## ఉడకని అన్నం తిని హాస్పటల్ పాలైన 20 మంది విద్యార్థులు



- వంట మనిషి లోపం అంటున్న పాఠశాల యాజమాన్యం
- భోజన నాణ్యత లోపించిందని ఆరోపిస్తున్న తల్లిదండ్రులు
- ఉడకని అన్నం పెట్టడం ఏంటి అంటున్న వైసిపి నాయకులు

**ఎటపాక, పెన్ పవర్, జూలై 11 :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని గౌరీదేవిపేట జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థులు ఉడకని మధ్యాహ్నం భోజనం తిని అస్వస్థకు గురి అయిన ఘటన చోటు చేసుకుంది, వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసినదే, అయితే శనివారం మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా వంటశాలలో వంటమనిషి వండిన భోజనం ఉడికి ఉడకనట్లుగా ఉండడంతో అదే భోజనాన్ని పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పెట్టడం జరిగిందని ఆ భోజనం తిన్న విద్యార్థులు గంట వ్యవధిలోనే కడుపులో నొప్పి అంటూ ఏడుస్తూ ఉండటంతో పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం కనితి. శేఖర్ వెంటనే పాఠశాల విద్యార్థులను ప్రక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లి విద్యార్థులకు చికిత్సను అందించడం జరిగిందని, చికిత్స పొందిన విద్యార్థులు ఇప్పుడు నార్మల్ స్థితిలోనే ఉన్నారని ఇలా జరగడానికి ముఖ్య కారణం వంటమనిషి వండి ఉడికి ఉడకని భోజనం పెట్టడంతో విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని పాఠశాల హెచ్ఎం తెలిపారు, కానీ పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి, గత కొంతకాలంగా మధ్యాహ్నం భోజనం ఉడికి ఉడకనట్టుగా వడ్డిస్తున్నారని అందువలన విద్యార్థులకు కడుపులో నొప్పి వాంతులు అవుతున్నాయని తెలిపారు, వంట మనిషి నిర్వహణ వల్ల పిల్లలు విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని అందువలన తరువాయి 4లో..





## సత్యసాయి త్రాగునీరు లేక వదలని ప్రజల దాహం

20 నెలలుగా జీతాలు లేక ఉద్యోగులు ఆందోళనలో.. మండలంలోని ప్రతి గ్రామంలో త్రాగునీటి కొరత...

నాలుగు రోజులుగా శుద్ధ నీరు అందక ఆరోగ్య సమస్యలు.. ఇతర నీళ్లు తాగడం వల్ల పేగు, జ్వరం సమస్యలు..

ఉద్యోగులకు జీతాలు చెల్లించి సేవలు పునరుద్ధరించాలి... ప్రజా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసిన అధికారులపై విమర్శలు..



**దేవీపట్నం,పెన్ పవర్, జూలై11 :** అల్లూరి సీతారామ రాజు జిల్లా దేవీపట్నం మండలంలో ప్రజలు త్రాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కొనసాగుతున్న శ్రీ సత్యసాయి త్రాగునీటి పథకం గత కొన్ని రోజులుగా పూర్తిగా స్థంభించిపోయింది.గత నాలుగు రోజులుగా ఈ పథకం ద్వారా నీరు రాకపోవడంతో వందలాది కుటుంబాలు అత్యవసర అవసరాలకు ఇతర నీటిపై ఆధారపడుతున్నారు.దీంతో ప్రజల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు సమాచారం.ఈ పథకం ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న నివాసితులకు రోజూ నిక్షిప్త నీరు సరఫరా అవుతూ వచ్చింది.అయితే గత 20 నెలలుగా జీతాలు అందకపోవడంతో సత్యసాయి త్రాగునీటి పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. తమ కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగులు చేపట్టిన ఆందోళనతో నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దశాబ్దాలుగా శుద్ధమైన త్రాగునీటిగా గుర్తింపు పొందిన ఈ పథకం ఆగిపోవడంతో ప్రజలు ఇతర ప్రైవేటు వనరులపై తరువాయి 4లో..

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

### - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం పెన్ పవర్ పవర్ జూలై 11 :** గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారికి చేయించుకున్నవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం లింగ నిర్ధారణ నిషేధత చట్టం - 1994 అమలుపై జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహాకమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ, రెవిన్యూ, పోలీస్, అధికారులు సమ న్వయంతో పనిచేసి ,పీసి పీఎన్ డిటి చట్టం అమలుతీరు, స్కానిం గ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ రె న్యూవల్, డెకాయ్ ఆపరే షన్లు, ఆకస్మిక తనిఖీలను ఎన్ జి వోల ప్రతినిధుల సమన్వయంతో సంబందిత అధికారులు ముమ్మరం



చేయాలన్నారు. జిల్లాలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లలో అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగిం చుకోవడం చట్టరీత్యా నేరమని నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానిం గ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. వారిపై చట్టప . డేకాయ్ ఆపరేషన్లు నిర్వహించి విచారణ చేసి, రుజువైతే ఆయా స్కానింగు సెంటర్లను సీజ్ చేసి, జరిమానాలు శిక్షలు విధించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్ష చేయడం, చేయించుకోవడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ లింగ ఎంపిక నిషేధ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లి ష్మెంట్ యాక్టుపై సమీక్షిం చారు లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరమన్నారు . పుట్టబోయేది ఆడబిడ్డ, మగబిడ్డ అని తెలియజే యకూడదని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, చేయించు కున్న వారు శిక్షార్హులన్నారు. క్రొత్తగా స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ కొరకు వచ్చిన ప్రతిపాదనలలో అన్ని సౌకర్యాలు కలిగిన స్కానింగ్ సెంటర్లకుఅను మతులు జారీ చేయాలని తెలిపారు. జిల్లాలోని క్లిని కల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్ట ప్రకా రం అన్ని కేంద్రాలలో డేకాయ్ ఆపరేషన్లు నిర్వ హించి లింగ నిర్ధారణ చేస్తున్నట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు గైకొనాలన్నారు. మూడు కొత్త అల్ట్రా స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ లకు రెండు కేంద్రాల రెన్యువల్ కు మూడు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల ఆధునీకరణకు ఒక కేంద్రం మూసివేతకు కమిటీ సభ్యులు అనుమతితో జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. ఈ కార్యక్రమంలో డిఎం&హెచ్వో ఎం దుర్గా రావు దొర, అదనపు డిఎం హెచ్ ఓ, భరత లక్ష్మి అదనపు జిల్లా ఎస్పీ ప్రసాద్, డిఐఓ సత్య నారాయణ ఐసిడిఎస్ పిడి శాంత కుమారి, డిఐపిఆర్ఓ సిహెచ్ శ్రీనివాస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అన్నదేవరపేట సొసైటీ నూతన చైర్‌పర్సన్‌గా జివి



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 11 :** అన్నదేవరపేట సొసైటీ నూతన చైర్ పర్సన్‌గా గౌరిజాల వెంకట ప్రసాద్(జివి) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఈయనను పలువురు పూల మాలలతో, శాలువాలతో సత్కరించటం జరిగింది. ఈ నేపద్యంలో జివి మాట్లాడుతూ సొసైటీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని, గ్రామస్తులు, రైతులు సహకరించాలని కోరారు. అదేవిధంగా సొసైటీ నూతన పర్సన్ లుగా చెవ్వూరి బంగార్రాజు, వెలుగుబండి బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. వీరిని పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సొసైటీ కార్యదర్శి పాపోలు శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు పోసిన శ్రీకృష్ణ దేవరాయలు, కొఠారి వెంకట్రావు, ముళ్ళపూడి శ్రీరామచంద్ర మూర్తి, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి తదితరులు నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## భక్తుల అభిప్రాయాలతో ఆలయ అభివృద్ధి

### - "డయల్ యువర్ ఈవో" ఎన్.ఎస్.చక్రధర్ రావు

**ఆత్రేయపురం పెన్ పవర్ జులై 11 :** భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా కొనసాగుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో, "డయల్ యువర్ ఈవో" కార్యక్రమం ద్వారా భక్తుల సమస్యలు, సలహా లను స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిం చిన కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 30-40 కాల్స్ ద్వారా భక్తులు తమ అభిప్రాయా లను తెలియజేశారు. హైదరాబాద్, తాడేపల్లిగూడెం నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌లో పార్కింగ్ సమస్యలు తెలిపి, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని ఈవో హామీ ఇచ్చారు.



**అన్నదానంపై స్పందన :** శనివారాలు లక్షలాది భక్తులు దర్శనానికి రావడంతో, అన్నదాన సదుపాయం మరింత మెరుగుపరచాలన్న అభిప్రాయాన్ని భక్తులు వెల్లడించారు. ప్రతిస్పందిస్తూ, ప్రతి శనివారం 20 వేల నుండి 25 వేల మందికి భోజనం అందిస్తామని, భవిష్యత్తులో వకుళమాత అన్నదాన భవనం పూర్తయిన వెంటనే అరటిపళ్లపై భోజనం సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు.

**భద్రత, క్యూలైన్లు, నీటి సదుపాయాలు :** శనివారాల రద్దీకి తగిన విధంగా ఫ్లైఓవర్ ఏర్పాటు, అదనపు క్యూలైన్లు, మంచినీటి సదుపాయాలు, చిన్నపిల్లల కోసం బిస్కెట్లు పంపిణీ వంటి చర్యలు తీసుకున్నామని, భక్తుల సూచనల మేరకు ఆలయంలో భద్రతా సిబ్బంది సంఖ్యను పెంచుతామని డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం భక్తులకు అవకాశం కల్పిస్తూ "డయల్ యువర్ ఈవో" కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. భక్తుల అభిప్రాయాల ఆధారంగా ఆలయ నిర్వహణను మరింత సజావుగా మార్చే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు.





-7లో..

## గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధం



**సీతానగరం, పెన్ పవర్, జూలై 11 :** సీతానగరం మండలంలోని సింగవరం గ్రామపంచాయతీ పరిధిలో గ్యాస్ సిలిండర్ పేలడంతో గుడిసె కాలిపోయింది. సింగవరం గ్రామానికి చెందిన వీరమాసి పోసియ్య అత్తమామలు గత రెండు నెలల నుంచి అనారోగ్యం కారణంగా ముగ్గళ్ళగ్రామానికి చెందిన అప్పలరాజు భార్య పెద్ద పార్వతి సింగవరంగ్రామంలో అల్లుడు దగ్గర గత కొంతకాలం నుండి నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒకసారిగా మంటలు చెలరేగడంతోఇంట్లో ఉన్న సామాగ్రి అగ్నికి ఆహుతి అయింది, చుట్టుపక్కల ఉన్నవారు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే క్రమంలో సీతానగరం ఎస్సై డి. కూమార్ ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేయగా సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఇంటి యాజమాన్యం అప్పలరాజు తెలిపారు.



## కాకినాడలో టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్

- 30 అర్జీలు స్వీకరణ - 15 సమస్యలు తక్షణ పరిష్కారం



**పెన్ పవర్, కాకినాడ, జూలై 11 :** రాజ్యసభ సభ్యులు శ్రీ సానా సతీష్ బాబు గారి ఆదేశాల మేరకు కాకినాడలోని వారి కార్యాలయంలో 13వ వారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు వెల్లడి చేశారు.ఈ సందర్భంగా మొత్తం 30 ప్రజా అర్జీలు స్వీకరించగా,వాటిలో 15 సమస్యలకు కార్యాలయ ప్రతినిధులు అదే సందర్భంలోనే తక్షణ పరిష్కారం కల్పించారు. మిగిలిన సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధా న్యత ఇవ్వాలని, బాధితులకు న్యాయం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికా రులకు ఆదేశాలు జారీచేసినట్లు టీడీపీ నేతలు తెలిపారు. ఈ దర్బార్‌లో టీడీపీ జిల్లా నాయకులు అరిగెల శ్రీనివాస్ రావు (బున్నీ),ఆనంద్ న్యూటన్,చింతపల్లి అర్జున్, దుర్గా ప్రసాద్, జున్నూరు బాబ్జి,నులుకుర్తి వెంకటేశ్వర రావు, ముమ్మిడి వెంకటేశ్వ రరావు, యాళ్ల చక్రవర్తి, డిఆర్ యు సీసీ సభ్యుడు ముత్యాల అనిల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాకినాడ టీడీపీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ లెక్చరర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి

- జూలై 15 నుండి 23 వరకు కంప్యూటర్ బేసిడ్ టెస్ట్
- రెండు సెషన్లలో పరీక్షలు : డిఆర్ఓ జె.వెంకటరావు

**పెన్ పవర్, కాకినాడ, జూలై 11 :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించనున్న లెక్చరర్ పోస్టుల నియామక పరీక్షలకు కాకినాడ జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిఆర్ఓ జె. వెంకటరావు తెలిపారు. జూలై 15 నుండి 23వ తేదీ వరకు (జూలై 19 మినహా) ఈ పరీక్షలు కంప్యూటర్ బేసిడ్ టెస్ట్ (సిబిటి) విధానంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.పరీక్షలు ప్రతి రోజూ రెండు సెషన్లలో జరుగుతాయి:ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకుపరీక్షా కేంద్రాలు:ఎస్. అచ్చుతాపురం ఐయాన్ డిజిటల్ జోన్ ,రాయుడు పాలెం సాఫ్ట్ టెక్నాలజీస్పరీక్షల నిర్వహణలో తీసుకున్న ప్రధాన చర్యలు:ప్రశాంత వాతావరణం కోసం టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకోసం విద్యుత్ శాఖకు ఆదేశాలు మెడికల్ టీంలు ఏర్పాటు చేయాలని డిఎం & హెచ్ఓకు ఆదేశం.ఎలక్ట్రానిక్ వస్తువులకు నిషేధం, అభ్యర్థులు సెల్‌ఫోన్, స్మార్ట్‌వాచ్ తదితరులు తీసుకురావొద్దుఎపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు పరీక్షా కేంద్రాల వద్దకు ఏర్పాటు చేయాలని సూచనడిఆర్ఓ వెంకటరావు మాట్లాడుతూ,అభ్యర్థులు పరీక్షల నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఏవైనా అనుమానాలుంటే అధికారిక సమాచారం ఆధారంగా స్పందించాలని సూచించారు.

## అర్హులైన దివ్యాంగులకు రూ.15 వేలు పెన్షన్ అందించాలి



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 11 :** అర్హులైన దివ్యాంగులకు రూ.15 వేలు పెన్షన్ అందించాలని పారా స్వచ్ఛంద సంస్థ ల్యాంప్ అద్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బయమ్మ, సిబిఆర్ కోఆర్డినేటర్ బి.మహిమారావు అన్నారు. వారి ఆధ్వర్యంలో మండలంలోని పినపల్ల గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ సంగీత సుభాష్ అధ్యక్షతన దివ్యాంగుల హక్కుల సంక్షేమ పథకాలు వారి సమస్యలపై అవగాహన సదస్సు జరిపించి, భారీ ర్యాలీని నిర్వహించారు. బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. చిన్నారులకు చిన్నతనంలోనే నెలకొన్న అంగవైకల్యాన్ని గుర్తించి వారందరినీ మండస్థాయిలో ఏర్పాటు చేసిన భవితా కేంద్రాల్లో చేర్పించేందుకు పార స్వచ్ఛంద సంస్థ పూర్తి స్థాయిలో పనిచేస్తుందన్నారు. అలాగే ప్రభుత్వం నుండి దివ్యాంగులకు వచ్చే సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అనంతరం సర్పంచ్ సుభాష్ తో కలిసి గ్రామంలో దీర్ఘకాలికంగా పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న సుమారు 8 మంది వికలాంగులు వద్దకు చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకోగా ప్రభుత్వం నుండి రావలసిన రూ. 15 వేలు ఇప్పటివరకు రాకపోవడానికి గుర్తించిన వారు వెంటనే అర్హత ఆధారంగా పెన్షన్ అందించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుభాష్ మాట్లాడుతూ వికలాంగత్వంతో బాధపడుతున్న వారికి సదరం వెబ్ లో విభాగం లేకపోవడంతో రూ.15 వేలు పెన్షన్ తీసుకోవడానికి అర్హులైన వారు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి వారి నిమిత్తం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి సంబంధిత వికలాంగులకు తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, మాజీ ఏఎంసీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణ్రావు, తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని

## తనిఖీ చేసిన ఎంపీడీవో



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 11 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల చేయూత కోసం నిర్వహిస్తున్న మండల కేంద్రంలోని ఉచిత కుట్టు శిక్షణ(టైలరింగ్) కేంద్రాన్ని ఇంచార్జ్ డిఎల్పిఓ, ఎంపీడీవో ఏ.రాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులు నిర్వహించే లీడర్లకు పలు సలహాలు, సూచనలు అందజేసి విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే శిక్షణలో పాల్గొనే మహిళలు పూర్తి స్థాయిలో నేర్చుకోవాలని అలాగే హాజరు శాతాన్ని పరిశీలించి 70 శాతం హాజరు తప్పక ఉండాలని, లేనిపక్షంలో వారికి లబ్ది చేకూరదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థలు పాత్ర కీలకం

### పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అమలాపురం పెన్ పవర్ జూలై 11 :** శుక్రవారం విశాఖ పట్నం కలెక్టరేట్‌లో జరిగిన ప్రభుత్వ రంగ సంస్థల సంఘాల సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ గౌరవార్థంగా పాల్గొన్నారు. ఈ సమావేశం ప్రభుత్వ రంగ సంస్థల ప్రస్తుత పరిస్థితులు, సమస్యలు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ముఖ్యమైన వేదికగా నిలిచింది.కార్మిక సంఘాల ప్రతినిధులు, అధికా రులు, నిపుణులతో కలిసి జరిగిన ఈ చర్చల్లో గిడ్డి సత్యనారాయణ సుదీర్ఘ అనుభవంతో కూడిన విలువైన సూచనలు అందించారు. సభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, అవి కేవలం ఉద్యోగ అవకాశాల కల్పనకే కాకుండా సామాజిక న్యాయం, ప్రాంతీయ సమ తుల్యత సాధనకు కూడా ఎంతో ఉపయుక్తమని చెప్పారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంస్థల పనితీరు మెరుగుదల వంటి అంశాలపై ఆయన గంభీరంగా స్పందించారు. ఉద్యోగుల సమస్య లను ప్రభుత్వ స్థాయిలో ప్రతినిధిగా కచ్చితంగా ప్రతిధ్వనించే విధంగా వ్యవహరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశం ద్వారా పలు ప్రభుత్వ రంగ సంస్థల సమస్యలు సమగ్రంగా వెలుగు చూసినట్లే కాకుండా, వాటి పరిష్కారానికి గల అవకాశాలపై సానుకూల దిశగా చర్చలు జరిగాయి. ప్రజల సంక్షేమాన్ని, ఉద్యోగాల సృష్టిని, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ వ్యవహరిస్తున్న తీరు అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పటిష్టత కోసం ఈ సమావేశం ద్వారా తీసుకున్న నిర్ణయాలు సమాజానికి మేలు చేసేలా ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ, అండర్-19 హాకీ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాలు - అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు పరిశీలన





**పెన్ పవర్, కాకినాడ, జూలై 11 :** కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రాబోయే ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ మరియు జాతీయ అండర్-19 హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రతిష్టా త్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ రెండు ప్రధాన ఈవెంట్లకు అన్ని వసతులు, సేవలు అందుబాటులో ఉండేలా పటిష్ట ఏర్పాట్లు చేయాల ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో శు క్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.రెవెన్యూ, మున్సిపల్,ఆర్అండ్‌బి, పౌరసర ఫరాల, ట్రాన్స్‌పోర్ట్, ట్రాఫిక్ పోలీసులు తదితర శాఖల అధికారులు ఈ పరిశీలనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఆగస్టు 1 నుంచి 12 వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు,ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీజిల్లా క్రీడా మైదానంలో జరగనున్నట్లు తెలిపారు.

పరిశీలించిన ఏర్పాట్లు : ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్ తాగునీటి వసతి మరుగు దొడ్లు,విద్యుత్ సరఫరా, పారిశు ధ్యం,వసతి,భోజన ఏర్పాట్లుక్వాష్ కోర్టు, వెయిట్‌లిఫ్టింగ్ ప్రాంగణాలు,డీఎస్ఏ భవనాలు ఈ రెండు కార్యక్రమాలను ఎటువంటి అంతరాయం లేకుండా, అత్యుత్తమ మౌలిక వసతులతో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అన్ని శాఖల సమన్వ యంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు,కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు,మున్సిపల్ కార్పొరేషన్ ఎడీసీ కె.పీ. సుధాకర్,పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.దేవులా నాయక్ సమా చార శాఖ డిడి డి.నాగార్జున,ఎంహెచ్ ఓ డా. పృథ్వీచరణ్,సెట్రాజ్ సీఈవో మల్లికా ర్జునరావు,హాకీ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ బి. రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా సెంటెన్స్ పాఠశాల

- దేవస్థానం భూములు ఈ పాఠశాలకు ఎలా సంక్రమించాయి? - దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య






**ఎటపాక, పెన్ పవర్, జూలై 11 :** ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న సెంటెన్స్ పాఠశాల విద్యాకు చట్టాన్ని అమలు చేయకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఫీజులు పేరుతో దోపిడీ చేస్తున్నారు అని దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య అన్నారు. ఈ పాఠశాలకు విద్య హక్కు చట్టంతో పనిలేదు అనుకుంటా, గత ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వమే ఫీజులు నియంత్రణ చేసి, ప్రభుత్వ విధించిన ఫీజులనే వసూలు చేయాలని నిబంధనలు ఇస్తే, ప్రస్తుతం ఈ సెంటెన్స్ పాఠశాల అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపటికి పాల్పడుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ఈ పాఠశాల పట్టణ ప్రాంతాల్లో మాదిరిగా ఫీజులు వసూలు చేయడం సరికాదు అన్నారు. అధిక ఫీజులే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా తమ పాఠశాలలోనే బుక్స్, పాఠశాల యూనిఫామ్ ఇతరత్రా మొత్తం మా దగ్గర కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం సెక్షన్ 12 (1 )సి ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాల 25% నిరుపేద విద్యార్థులకు కేటాయించాలని చెబుతుంటే, గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాల మాత్రం విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి నిరుపేద విద్యార్థులకు 25% ఉచిత విద్యను అందించడం లేదు. అదేవిధంగా దేవస్థానం అధికారులను దళిత సంక్షేమ సంఘం గా మేము ఒకటే కోరుతున్నాము మీ ప్రతాపం నిరుపేద ఇండ్లలో నివసించే వారి మీద కాకుండా ఈ పాఠశాల దేవస్తానం భూముల్లోకి ఎలా వచ్చిందో ఒకసారి విచారణ చేయాలని కోరుతున్నాము. ఏ విధంగా దేవస్థానం వద్ద నుంచి గిరిజనుల పేరుతో ఈ భూములను ఏ ఉద్దేశంతో కొనుగోలు చేశారో, ఆ ఉద్దేశం నెరవేరిందా!లేకుంటే ఈ పాఠశాల నిర్మించడానికి దేవస్థానం భూములు కొనుగోలు చేశారనేది అధికారులు ఆలోచించాలని కోరుతున్నాము. అధికారుల స్పందించి మారుమూల గిరిజన ప్రాంతంలో ఉన్న ఈ సెంటెన్స్ పాఠశాల యొక్క ఫీజుల దోపిడీని అరికట్టి, అసలు ఈ పాఠశాల నిర్మాణానికి దేవస్థానం భూములు ఏ విధంగా ఇచ్చారో సమగ్ర విచారణ జరిపి దేవస్థానం భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాము.

# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 11 :** మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పెదపళ్ల చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు ఎన్.లక్ష్మీస్నేహలత, డి.సాయి కిషోర్, బి.అనంత రామకృషణ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీలను నిర్వహించి జనాభా వృద్ధి వల్ల కలిగే ఆవశ్యకతను,, వనరుల లభ్యతను వివరించారు. అలాగే ఆయా గ్రామా ల్లో జనాభా దినోత్సవం జరుపుకుంటున్న విధా నాన్ని వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. నిర్ణీత వయస్సు వచ్చిన తరువాత మాత్రం వివాహాలు చేసి ఆరోగ్యకరమైన శిశువులకు జన్మను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, కల్పిస్తున్న సౌకర్యాలను ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఆరోగ్యవంతమైన జనాభా కోసం, ఆదర్శవంతమైన సమాజం కోసం తమ వంతు కృషి చేస్తామంటూ వైద్యారోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

అలాగే ఆయా గ్రామాల్లోని ఆయుష్మాన్ మందిరాల్లో ఎంఎల్‌హెపీల ఆధ్వర్యంలో ప్రపంచ దినోత్సవం జరిగింది. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్. హెచ్ఈఓలు ఏవివి.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివ ప్రసాద్, ఎం.శ్రీనివాస రావు, ల్యాబ్ టెక్నీషియన్ పి.రాజా రమేష్‌కుమార్. ఎస్ఎన్ ఎన్.లక్ష్మీ, ఫార్మాసిస్టు డి.సుగుణలక్ష్మి, ఆరోగ్య ఆశ సిబ్బంది పాల్గొన్నారు.



## ఉడకని అన్నం తిని హాస్పటల్ పాలైన 20 మంది విద్యార్థులు

(3వ పేజీ తరువాయి) వంట మనిషిని మార్చి మంచిగా భోజనం తయారు చేసే వంట మనిషిని ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు, ఈ ఘటనపై వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు (పెద్దోడు) మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలకు ఏర్పాటుచేసిన మధ్యాహ్నం భోజనంలో అన్ని అవకతవకలే జరుగుతున్నాయని అదే విధంగా సన్న బియ్యం తో మధ్యాహ్నం ఏర్పాటు చేస్తానన్న ప్రభుత్వం మరల దొడ్డు బియ్యాన్ని పాఠశాలలకు పంపుతున్నారని ఆరోపించారు, వంటశాలలో పనిచేసే వంట మనుషులను మంచిగా ఉండే వ్యక్తులను ఏర్పాటు చేస్తే విద్యార్థులు పౌష్టికంగా భోజనం చేస్తారని లేనిపక్షంలో ఇటువంటి ఘటనలు జరుగుతాయని తెలియజేశారు, డాక్టర్ దేవీనాథ్ తెలిపిన వివరాలు ప్రకారంగా పాఠశాల విద్యార్థులకు ఎటువంటి భయము లేదని ఉడికి ఉడకని భోజనం వల్లే ఈ విధమైన కడుపు నొప్పి వాంతులు అయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు భయపడే అవసరం లేదని తెలిపారు,ఇటువంటి ఘటన ఇంకొకసారి పురావృత్తం అయితే సహించేది లేదని పాఠశాల హెచ్ఎం వంట మనిషికి హెచ్చరించారు.

## సత్యసాయి త్రాగునీరు లేక వదలని ప్రజల దాహం



(3వ పేజీ తరువాయి) ఆధారపడుతూ,వాటి వల్ల పేగుల సమస్యలు,జ్వరం,వాంతులు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని బాధితులు చెబుతున్నారు.పిల్లలకు ఈ నీరు తాగించలేం.గతంలో ఎప్పుడూ ఇలాంటివి జరగలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి అంటూ ఓ గ్రామస్థుడు విచారం వ్యక్తం చేశారు.ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని మండల ప్రజలు మండిపడుతున్నారు.ఇక తాము ఇన్ని నెలలుగా జీతాలు లేక జీవితాంతపు సంక్షోభంలో కూరుకుపోయామని,తమ సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామని సత్యసాయి ఉద్యోగులు స్పష్టం చేశారు.

**ప్రజలు,గ్రామ పెద్దలు,ప్రభుత్వాన్ని కొన్ని డిమాండ్స్ కోరారు :**

తక్షణమే సత్యసాయి త్రాగునీటి పథకానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలి. 20 నెలలుగా జీతాలు లేక బాధపడుతున్న ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలి. త్రాగునీటి సరఫరా యధాతథంగా ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలి. పథకం నిర్వహణ బాధ్యతను పునఃసమీక్షించి సమర్థవంతంగా అమలు చేయాలి.ఈ మేరకు ప్రభుత్వం గమనించి హస్తక్షేపం చేయకపోతే,ప్రజల ఆరోగ్యమే కాక,ఆయా గ్రామాల్లో తీవ్ర ఆందోళనలు తలెత్తే అవకాశం ఉందని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## కిర్లంపూడిలో ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం





**కిర్లంపూడి పెన్ పవర్, జులై 11 :** మండల కేంద్రమైన కిర్లంపూడిలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారి రాంబాబునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని పురస్కరించుకుని సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కిర్లంపూడి నుండి డాక్టర్ రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో గ్రామంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భాధారణ, బిడ్డకు,బిడ్డకు మధ్య అంతరం ఉండాలని, తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వంటి సూచనలు చేశారు . ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ, జ్యోతి,పి హెచ్ ఎన్,అన్నపూర్ణ హెల్త్ సూపర్వైజర్స్ రమణ మూర్తి, అనంతలక్ష్మి,హెల్త్ అసిస్టెంట్లు , ఏఎన్ఎంలు ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

## మండలంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం



**వై.రామవరం, పెన్ పవర్, జూలై 11:** మండలంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం గ్రామ గ్రామాన నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు. దాలిపాడు పంచాయతీలో నిర్వహించిన డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో ఎంపీడీవో బాపన్న దొర పాల్గొన్నారు. వర్షాకాలంలో నీటి నిలువలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. గ్రామంలో ను,ఇంట్లో కూడా నీటి నిల్వలు లేకుండా అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. దోమల లార్వాలు పెరగకుండా చూడాలని అన్నారు. అనారోగ్యం వారిని పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# వివిధ శాఖల పనితీరుపై ప్రజల నుంచి ప్రతికూల ఆరోపణలు

## - ఒకే అంశానికి చెందిన ఫిర్యాదులు పదే పదే వస్తున్నాయి - జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 11 :** వివిధ శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలు చేస్తున్న తీరుపై ప్రజల నుంచి ప్రతికూల ఆరోపణలు నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో పి4, ప్రజాభిప్రాయం, హాస్పిటల్ సేవలు, సీజనల్ వ్యాధులు, వసతి గృహాల నిర్వహణ, మరమ్మత్తులు, టాయిలెట్స్ నిర్మాణాలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఒకే అంశానికి చెందిన ఫిర్యాదులు పదే పదే చేస్తున్నారని, అటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు.




క్షేత్ర స్థాయిలో వాస్తవంగా ఫిర్యాదు చేసిన వారిని కలిసి సమస్య తెలుసుకో గలిగితే కాని వాటికి సహేతుకమైన కారణాలు తెలియవని పేర్కొన్నారు. పి4 సర్వే ప్రక్రియ ప్రకారం జూలై 17 నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు సేకరించిన డేటా ఆధారంగా మార్గదర్శులతో, లబ్ధిదార బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలలో వారికి మెరుగైన జీవన ప్రయోజనాలను, వ్యక్తిగత ఆరోగ్య స్థితిగతులు మెరుగైయ్యే విధంగా చర్యలు తీసుకోవడం ముఖ్యం అన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక నైపుణ్య పెంపు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయం విదితమే అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గ్రామ పంచాయతీలలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని, మూడోవ శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్లీ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు.

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ వసతి గృహాలలో టాయిలెట్స్ నిర్మాణం కోసం 200 పనులు చేపట్టవలసి ఉందన్నారు. వాటిని త్వరిత గతిన చేయడానికి అనుగుణంగా వివరాలను ఆర్‌డబ్ల్యుఎస్ వెబ్సైట్‌లో అప్లోడ్ చెయ్యాలని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాలలో తహసీల్దార్ లు తనిఖీలు నిర్వహించి, నివేదిక అందచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పి హెచ్ సి పరిధిలో అందుతున్న వైద్య సేవలు, మందులు వినియోగంతో పాటు శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణ వివరాలు ఆన్లైన్ లో అప్లోడ్ చెయ్యాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా రానున్న 4 లేదా 5 నెలలు అత్యంత ప్రాధాన్యత కలిగిన సమయం అన్నారు. వైద్య పరీక్షలు నిర్వహణ, ఇతర అనుబంధ కార్యకలాపాలు నిర్వహించే క్రమంలో వాటి వివరాలు జియో ట్యాగింగ్ చేసి, అప్లోడ్ చెయ్యాలని పేర్కొన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో విత్తనాల పంపిణీ కోసం ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, సిపిఓఎల్ అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రంగరాయ వైద్య కళాశాలలో లైంగిక వేధింపుల ఘటనలో నలుగురు సస్పెండ్, అరెస్ట్

## - ఫిర్యాదులపై తక్షణ స్పందన - నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు : జిల్లా కలెక్టర్, ఎస్పీ వెల్లడి




**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, జూలై 11 :** కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై జిల్లా యంత్రాంగం కఠినంగా స్పందించింది. నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ల్యాబ్ అటెండెంట్, టెక్నీషియన్లను విధుల నుండి సస్పెండ్ చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జి. బిందుమాధవ్ సంయుక్తంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఈ విషయాలను వెల్ల డించారు. కలెక్టర్ వివరించిన ప్రకారం, జూలై 9న బీఎస్సీ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ (ఎం.ఎల్.టి) కోర్సు చదువుతున్న 60 మంది విద్యార్థులు ల్యాబ్ అసిస్టెంట్ వి. కళ్యాణ చక్రవర్తి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు.

**తక్షణ విచారణ :** ఫిర్యాదుపై కళాశాల ప్రిన్సిపాల్ స్పందించి, లైంగిక వేధింపుల నిరోధక అంతర్గత కమిటీకి విచారణ అప్పగించారు. జూలై 9, 10 తేదీలలో కమిటీ సభ్యులు విద్యార్థినులు, నిందితుల వాంగ్మూలాలు రికార్డు చేశారు. 55 మంది విద్యార్థినులు లైంగిక వేధింపులు జరిగినట్లు స్పష్టంగా పేర్కొనగా, వాంగ్మూలాలు, మెసేజులు, ఇతర ఆధారాల ఆధారంగా నిందితుల దోషబద్ధతను కమిటీ నిర్ధారించింది.

**నిందితుల, వివరాలు :** 1. వి. కళ్యాణ చక్రవర్తి–ల్యాబ్ అసిస్టెంట్ 2. ఎస్. గోపాలకృష్ణ ల్యాబ్ టెక్నీషియన్ 3. బి.జిమ్మిరాజు–ల్యాబ్ టెక్నీషి యన్,4. జివిఎస్ ప్రసాదరావు–ల్యాబ్ టెక్నీషియన్‌ఈ నలుగురినీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ చేశారు. అనంతరం 1 టౌన్,2 టౌన్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు నమోదు కాగా, మధ్యాహ్నం 2:30 లోపే నిందితులంతా అరెస్ట్ అయ్యారని కలెక్టర్ తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి. విశ్వాసం కలిగించిన చర్యలు:కలెక్టర్ విద్యార్థినుల ధైర్యాన్ని ప్రశంసించారు. తక్షణ స్పందన కనబరిచిన ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కమిటీ సభ్యులను అభినందించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మహిళల రక్షణకు ఉన్న అంతర్గత కమిటీలను బలోపేతం చేసి మరింత చైతన్యపరుస్తామని తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఫిర్యాదు ఉదయం వస్తే, మధ్యాహ్నం లోపే నిందితుల అరెస్ట్ జరిగింది. శక్తి యాప్ వినియోగం గురించి విద్యార్థినులు,మహిళల్లో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉంది. శక్తి యాప్ ద్వారానే ఎలాంటి అనుచిత ఘటనలపై వెంటనే స్పందన పొందవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు: రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏ. విష్ణువర్ధన్ జిజిహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డా.పి. శ్రీనివా సన్,ఆర్‌ఎంసీ పారామెడికల్ కోర్సుల కో–ఆర్డినేటర్ డా. కె. సతీష.ఈ సంఘటనపై జిల్లా యంత్రాంగం చూపిన స్పందన, విద్యార్థినుల ధైర్యవంతమైన ముందడుగు మహిళా రక్షణకు మేల్కొలుపు కావాలని పత్రిక వ్యాఖ్యానిస్తోంది.

## సాయిబాబా గుడి ఆలయ కమిటీ పర్మిషన్‌తోనే

# మా స్థలంలోకి వచ్చిన స్లాబ్ కట్ చేశాం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 11 :** స్థానిక గోకవరం రోడ్ లోని నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా గుడిపై వచ్చిన వివాదంపై శుక్రవారం స్థల యజమానులు కారుకొండ శ్రీనివాసరావు, కారుకొండ శ్రీను విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2019 సంవత్సరంలో కొత్త శ్రీనివాస రెడ్డి అనే వ్యక్తి దగ్గర 50 గజాల స్థలం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అక్కడ చిన్న షాప్ కూడా ఏర్పాటు చేసుకుంటున్నామని అయితే సాయిబాబా గుడి నిర్మాణానికి కొద్దిగా స్థలం కావాలంటే నాలుగు అడుగుల స్థలం ఇవ్వడం జరిగింద న్నారు. అయితే ఆరడుగుల స్థలం వరకు స్లాబ్ చేయడంతో మా స్థలంలోకి వేసిన రెండు అడుగులు స్లాబ్ గుడి కమిటీ పెద్దలకు తెలియ జేసి తొలగించడం జరిగిందన్నారు. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా మీడియా ప్రతినిధులకు చూపించారు. జగ్గం పేటలో అనేక రకాల కబ్జాలు చేస్తున్న వ్యక్తి దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆఖరికి రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కూడా తన కబ్జాలకు ఉపయోగించుకున్నారని విమర్శించారు. ఈ గుడి వివాదానికి రాజకీయ నాయకులకు ఏమి సంబంధం లేదని స్పష్టం చేశారు.

# కాకినాడలో ప్రపంచ జనాభా దినోత్సవం వేడుకలు

## - జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ

## - మై భారత్ వాలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనడం విశేషం






**కాకినాడ, పెన్ పవర్,జూలై 11 :** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖకు అనుబంధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'మేరా యువ భారత్ కాకినాడ శాఖ మరియు కాకినాడ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించు కుని అవగా హన కార్యక్రమం స్థానిక డి ఎం హెచ్ ఓ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యాధికారి డా. నరసింహ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రపంచ జనాభా దినోత్సవ ప్రాము ఖ్యతను వివరించారు. అతివృద్ధి చెందిన జనాభా వనరు లపై చేసే ప్రభావాన్ని, ఆరోగ్య, విద్య, జీవన ప్రమాణా లపై దాని ప్రభావాన్ని వివరించడమే కాక, ప్రజల్లో నియంత్రిత జనాభా గురించి అవగాహన పెంపొందిం చాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ సిబ్బందిలో డాక్టర్.సుబ్బరాజు (డిఐఓ), డాక్టర్ విల్సన్, డాక్టర్ ప్రభాకర్, డా. అరుణ, వాలంటీర్ ఎం. ప్రకాష్, యూత్ క్లబ్ సభ్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో నర్సింగ్ విద్యార్థుల అవగాహన ర్యాలీ కూడా నిర్వహించబడింది, ఇందులో "సురక్షిత భవిష్యత్తు కోసం నియంత్రిత జనాభా" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమం సమాజానికి అవసరమైన సున్నితమైన అంశంపై యువతను, ఆరోగ్య రంగాన్ని సమన్వయం చేస్తూ చక్కటి సందేశాన్ని ఇచ్చిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# ఆదివాసిల ఆరాధ్య దైవం కొమరం భీం విగ్రహం ధ్వంసం

## - ధ్వంసం చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలి

## - ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్



**కూనవరం,పెన్ పవర్, జూలై 11 :** ఆదివాసీల ఆరాధ్య దైవమైన కొమరంభీం విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కుంజా అనిల్ మాట్లాడుతూ మండలంలోని జగ్గవరం గ్రామం సచివాలయం ఎదురుగా ఉన్న కొమరం భీం విగ్రహాన్ని రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేయడం, అదే రోజు జగ్గవరం జంక్షన్ నందు ఆదివాసి స్తూపం లో ఉన్న జెండా కర్రను తీసి 100 మీటర్ల దూరం పడేయడం జరిగిందని,ఇవన్నీ ఎవరో ఆదివాసి సమాజంపై కక్షపూరిత చర్యలతోనే చేస్తున్నారని అన్నారు.మా జి ఓలు,మా హక్కులు,మా భూములు,చివరికి మా రిజర్వేషన్ల జోలికి వచ్చారు,అయినా సహించాము కానీ మా ఆదివాసీ ఆరాధ్య దైవం స్వాతంత్ర సమరయోధులలో ఒక్కరూ జల్ జంగల్ జమీన్ నినాద రూపకర్త కొమరం భీం విగ్రహాన్ని ధ్వంసం చెయ్యడం అంటే మా ఆదివాసి సమాజాన్ని రెచ్చగొట్టడమేనని అట్టివారిని ఉపేక్షించామని అన్నారు. ఈ కుట్రల వెనక ఎవరున్నారో తక్షణమే పోలీస్ వారు విచారణ జరిపి ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుష్టి జోగారావు,బేతి ముత్తయ్య,సోడే ముత్తయ్య,ఉయిక రాంప్రసాద్, మచ్చ వినయ్ కుమార్,ఆదివాసి నాయకులు పాయం లక్ష్మణరావు,పాయం సుబ్బారావు,చిచ్చడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ లో ప్రతీ సమస్యకు తక్షణ పరిష్కారం

## - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై:11 :** నియోజకవర్గంలోని ప్రజల ప్రతి సమస్య పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలువురు హాజరై వినతి పత్రాలను ఎమ్మెల్యేకు సమర్పించారు. ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత అధికారులకు సమస్య తెలిపి సత్వరమే సమస్య పరిష్కారం ఇవ్వాలని ఆదేశించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామాల్లో మౌలిక వసతుల అవసరాలపై ప్రజలు ప్రజా దర్బార్లో తెలియచేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా వంటి ప్రజా అవసరాలపై ప్రజా దర్బార్లో తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, బిజెపి ఇన్చార్జి దాట్ల కృష్ణ వర్మ, రేఖ బుల్లి రాజు, మండపాక అప్పన్న దొర, బద్ది సురేష్, యల్లపు దొరబాబు, బత్తుల వెంకన్న, షేక్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీకే సాధ్యం

## - జిల్లా అధ్యక్షులు జగ్గిరెడ్డి వెల్లడి



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 11 :** రాష్ట్రంలో రాజకీయ పార్టీలు అనేకం ఉన్నా సామాజిక న్యాయం అమలు చేసే పార్టీ మాజీ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని అపార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. మండలంలోని పెదపళ్లలోని నాయి బ్రహ్మణుల కులానికి చెందిన దొడ్డవరపు సుబ్బారావుకు జిల్లా కార్యవర్గంలో ఆగ్రీ జింగ్ సెక్రటరీగా చోటు లభించింది. అందులో భాగంగా తమ సేవలను గుర్తించి పదవికి ఎంపిక చేసిన మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా ఆయన నివాసమైన గోపాలపురంలో శుక్రవారం కలిసారు. పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి సామాజిక సమతుల్యతను పాటిస్తూ ప్రతిష్టాత్మకమైన పదవిని కట్టబెట్టిన మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించి రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువస్తామనని వాగ్దానం చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని పెదపళ్ల గ్రామ పార్టీ నేతలతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతిష్టాత్మకమైన పార్టీ పదవికి ఎంపికైన సుబ్బారావును కూడా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు నెక్కంటి వెంకట్రాయుడు, యేడిద మెహెర్ ప్రసాద్, మేడపాటి లక్ష్మణరావు, అలుగోజు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# కాజులూరులో బిఎల్ఓల శిక్షణా కార్యక్రమం నిర్వహణ

## - ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలపై అవగాహన

## - ప్రశంసాపత్రాల ప్రదానం



**పెన్ పవర్, కాజులూరు, జూలై 11 :** భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవెల్ అధికారులకు (వి ఎల్ ఓ లకు) శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు రామచంద్రపురం నియోజక వర్గంలోని కాజులూరు మండలంలోని బి ఎల్ ఓ లకు శుక్రవారం ఉదయం 9 గంటలకు కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్, ఇతర ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో బి ఎల్ ఓ లకు క్రింది అంశాలపై అవగాహన కల్పించారు: కొత్త ఓటర్ల నమోదు విధానంమరణించిన ఓటర్ల (డెత్ కేసులు) తొలగింపు ప్రక్రియ,ఓటర్ల నమోదులో తప్పుల సవరణఎన్నికల ప్రక్రియకు సంబంధిత ఇతర దశలపై సమాచారం, బూత్ లెవెల్ లో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు తీసుకోవలసిన చర్యలు,శిక్షణ అనంతరం బి ఎల్ ఓ ల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు పరీక్షలు నిర్వహించగా, ఉత్తమంగా పనిచేసిన బి ఎల్ ఓ లకు తహశీల్దార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ఎన్నికల నిర్వహణను మరింత పటిష్టంగా, పారదర్శకంగా మార్చేందుకు బి ఎల్ ఓ ల పాత్ర ఎంత కీలకమో ప్రతిపాదించింది. కార్యక్రమం ముగింపు సందర్భంగా అధికారులు బి ఎల్ ఓ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాజులూరు తహసిల్దార్ జి రవీంద్రనాథ్ ఠాగూర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి వేగేశ్వరరావు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, సచివాలయం సిబ్బంది, సచివాలయం సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలి

## - ఎమ్మెల్సీ రాజశేఖర్





**అమలాపురం/రాజోలు పెన్ పవర్, జూలై 11 :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వ తొలి సంవత్సర పాలనలో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన మొదలై సంవత్సర కాలం పూర్తయిందని రాక్షస పాలన ముగిసిన తరువాత అభివృద్ధికి సంక్షేమానికి ఇది తొలి అడుగు అని అన్నారు. ఈ సంవత్సర కాలం నుండి యన్ డి ఎ కూటమి ప్రభుత్వ పాలన లో రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్నాయని, రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నామని అన్నారు. ఈ సంవత్సర కాలంలో జరిగినటువంటి ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసి ప్రజలకు ఉన్న సమస్యలను మై టిడిపి యాప్ ద్వారా అప్లోడ్ చేయవలసిందిగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బత్తుల రాము, చాగంటి స్వామి, బోళ్ల సతీష్, పామర్తి రమణ, సర్పంచ్ కదలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ పేరుతో ఎస్సీలకు ఎంగిలి మెతుకులు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 12 :** ఎస్సీ వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతపై అన్ని రాజకీయ పార్టీలు శాశ్వతంగా కుట్ర చేస్తున్నాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్ ఎస్ రత్నాకర్ అన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసేటప్పుడు ఎస్సీ జనాభాకు సంబంధించినటువంటి డేటా ఆధారంగా చెయ్యమంటే డేటా లేకుండా ఎలా చేస్తారనీ ప్రశ్నించారు. 1931లో బ్రిటిష్ వాళ్ళు కులగణన చేపట్టారని దాని తర్వాత ఇంతవరకు ఆ లెక్కలు తీయలేదన్నారు. చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తామని తెలుగు రాష్ట్రాల్లో కుట్రపూరితంగా అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని ఎస్సీ వర్గీకరణ ముసుగులో తొక్కేస్తా ఉంటే రాజకీయ పార్టీలకు బానిసలుగా మారిన తొత్తులుగా మారిన మాల నాయకులు ఎవరూ కూడా దీనిపై నోరు మెదపకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పై నోరు మెదపని మాల నాయకులకు, మాల ప్రజా ప్రతినిధులకు, వర్గీకరణను సమర్థించే అన్ని రాజకీయ పార్టీలకు శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో ముగ్గురికి ప్రయోజనం జరుగుతుందని అన్నారు. వందలో ముగ్గురు ఎస్సీలకు ఇచ్చే సీట్లు విషయంలోనేనా వర్గీకరణ అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు జడ్జిలు, దేశ సంపద, క్యాబినెట్లో మంత్రి పదవులు, పరిశ్రమలు, దేశంలోని భూములు విషయంలో వర్గీకరణ అవసరం లేదా అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని అడిగారు. రిజర్వేషన్ పేరుతో ఎస్సీలకు పడేసే ఎంగిలి మెతుకుల్లోనే వర్గీకరణ పేరుతో పంపకాల కొట్లాటలు పెడతారా అని ఈ రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల ప్రేమ్ బాబు, కనికళ్ళ నాని, బచ్చుల చిన్నా, బొండు రాజు, కూసి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య హాస్పటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం




**గోకవరం, పెన్ పవర్, జూలై 11 :** మండల కేంద్రం గోకవరంలో ఇటీవల ప్రారంభించబడిన ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు శుక్రవారం కామరాజుపేట హైస్కూల్ నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రఘు, పిల్లల వైద్యురాలు డాక్టర్ భారతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పాలూరు బోసు బాబు, హై స్కూల్ కమిటీ చైర్మన్ బూతుకూరి రాధాకృష్ణ, కామరాజుపేట సొసైటీ చైర్మన్ పిర్లవెంకటేశ్వరరావు ,మాగంటి ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## రైతులకు అండగా నీటి సంఘాల నాయకులు





**ముమ్మిడివరం పెన్ పవర్ జూలై 11 :** రైతులకు అండగా నీటి సంఘాల నాయకులు తోడ్పడుతున్నారు. ఠాణేలంక గురుకుల పాఠశాల సమీపంలో, పంట బోదులలో అడ్డుకున్న గుర్రపుడెక్క, నీటి ఛానల్ పరిస్థితి, పనితీరును సానపల్లిలంక నీటి సంఘం అధ్యక్షులు జనసేన నాయకులు గుద్దటి రామకృష్ణ బాలకృష్ణ( జమ్మి), ఇరిగేషన్ అధికారిని మౌనిక శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షులు జమ్మి పెన్ పవర్ ప్రతినిధితో మాట్లాడుతూ చింతన లంక నుండి అన్నం పల్లి లాకుల వరకు సుమారు 23 కిలోమీటర్ల మేర క్రాస్ బండ్లు ఏర్పాటు చేసి 9 చానల్స్ లో 15 డైరెక్ట్ పంపులు ఏర్పాటు చేశామని అన్నారు. ముమ్మిడివరం మండలం కొత్తలంక మర్లపాలెం ప్రాంతాలలో నీటి ఎద్దడి పరిస్థితిని అధిగమించి రైతులకు నాలుగు తూరలు (తూము) ఏర్పాటు చేసి మర్లపాలెం పరిసర ప్రాంతాల్లో 280 ఎకరాలు రైతులకు నీటి వెసులుబాటు కల్పించామని అన్నారు. ప్రభుత్వ నిధులు మంజూరుతో పని లేకుండా రైతులకు చేదోడువాదోడుగా పనులు చేసి, నీటి ఎద్దడి లేకుండా పంట కాలువలను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, బి.సతీష్, శ్రీను సిహెచ్ శ్రీను వెంకటేశ్వరరావు, మునికంట పాల్గొన్నారు.

## కాకినాడ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 13న

439 ఓటర్లతో ఉత్కంఠభరిత పోటీ - కార్యదర్శి పదవికి హోరాహోరీ పోరు

**కాకినాడ,పెన్ పవర్, జూలై 11 :** కాకినాడ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 13వ తేదీన శ్రీనగర్ లోని ఆదిత్య డిగ్రీ కళాశాల సమీపంలోని సంఘ కార్యాలయంలో జరగనున్నాయి. మెడికల్ షాపుల హోల్‌సేల్ మరియు రిటైల్ వ్యాపారులకు చెందిన సుమారు 439 మంది సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు.ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి.అధ్యక్ష పదవికి జి. రాంప్రసాద్, సాయి రాం, సత్యనారాయణ పోటీ చేస్తున్నారు.కార్యదర్శి పదవికి ఆర్. దుర్గాప్రసాద్ మరియు సురేష్ మధ్య గట్టి పోటీ నెలకొంది.కోశాధికారిగా రవిరా హనుమ మరియు లోకనాథ్ బరిలో ఉన్నారు. అభ్యర్థులందరూ తమ గెలుపుపై నమ్మకంతో ఉన్నప్పటికీ, ముఖ్యంగా కార్యదర్శి పదవి కోసం జరుగుతున్న పోటీ హోరాహోరీగా మారింది.ఎన్నికల ప్రొసీజర్: ఈనెల 13వ తేదీ ఉదయం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుంది. అనంతరం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటింగ్ జరుగుతుంది. ఓటింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజున ఫలితాలను అధికారికంగా ప్రకటించనున్నారు.సభ్యులంతా ఎన్నికలను ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. విజయవంతమైన ఎన్నికల నిర్వహణకు సంఘం పటిష్ట ఏర్పాట్లు చేపట్టిందని నిర్వాహకులు తెలిపారు.

# కార్యదర్శులు బాధ్యతతో పని చేయాలి

- ఎంపిడిఓ బి.కృష్ణమోహన్



**పెనుమంట్ర,పెన్ పవర్, జూలై 11 :** పంచాయతీ కార్యదర్శులు తమ బాధ్యతలు నిబద్ధతతో నిర్వహించాలని ఎంపిడిఓ బి. కృష్ణమోహన్ స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులకు సంబంధించి నిర్ణీత రుసుము తీసుకొని, సమయానుకూలంగా సమాచారాన్ని అందించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, దానివల్ల కమిషన్‌లో అప్పీల్‌కు దారితీసే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే, పి-4 లో మార్గదర్శకులను నమోదు చేయడం, పిల్లల ఆధార్ నమోదును పూర్తిచేయడం, బయోమెట్రిక్ అప్డేట్లను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ పనులను పర్యవేక్షించి, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపిడిఓ కె. బులి సూరన్న, కార్యదర్శులు నాగబాబు, హనుమంత రావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో జిందాల్ (ఇండియా) లిమిటెడ్ "మిలాప్" రిటైలర్ మీట్

- రిటైలర్లతో నేరుగా మమేకం - ఉత్పత్తుల్లో నూతన ఆవిష్కరణలు, ప్రాంతీయ వ్యాప్తిపై దృష్టి



**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్, జూలై 11 :** భారతదేశ ప్రముఖ డౌన్‌స్ట్రీమ్ స్టీల్ ఉత్పత్తుల తయారీ సంస్థ జిందాల్ (ఇండియా) లిమిటెడ్, తూర్పు మార్కెట్లపై దృష్టిసారిస్తూ, ఆంధ్ర ప్రదేశ్‌లోని కాకినాడలో తన తొలి "మిలాప్" రిటైలర్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం శ్రీనగర్‌లోని నవీన స్టీల్స్ సహకారంతో నిర్వహించబడింది.ఈ మీట్‌లో కంపెనీ సీనియర్ అధికారులు పాల్గొని, 60 మందికి పైగా రిటైలర్లతో నేరుగా మమేకమయ్యారు. వారి అభిప్రాయాలు, మార్కెట్ సవాళ్లపై చర్చలు జరిపారు. మార్కెట్ విస్తరణ, ప్రాంతీయ విస్తృతిని ప్రోత్సహించేందుకు మిలాప్ ఒక కీలక వేదికగా నిలిచిందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉత్పత్తుల ప్రదర్శనలో ఆకర్షణ- "జిందాల్ సబ్రంగ్", "న్యూకలర్ం" ఈ సమావేశంలో సంస్థ తన పూతతో కూడిన అధునాతన స్టీల్ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను ప్రదర్శించింది."జిందాల్ సబ్రంగ్" అనే కొత్త ఉత్పత్తి శ్రేణి గోచరతను పెంపొందించే రంగు పూతలతో రూపొందించబడినదిగా, తుప్పు నిరోధకతలో ఉత్తమంగా నిలుస్తుందని కంపెనీ తెలిపింది. అలాగే, "న్యూకలర్ం" ఉత్పత్తులు అత్యాధునిక సాంకేతికతతో మేళవించి, మన్నిక, సౌందర్యం, పనితీరు పరంగా వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి చేయబడినట్లు వివరించారు.రాష్ట్రాల్లో పెట్టుబడుల దిశగా ముందడుగుసమావేశంలో సంస్థ ప్రతినిధులు రెగ్యులర్ మార్కెట్ నెట్‌వర్క్ బలోపేతంతో పాటు, సంస్థ ప్రాంతీయ ప్రణాళికలపై అవగాహన కల్పించారు. అలాగే, రిటైలర్ల నుండి వచ్చిన ప్రత్యక్ష ఫీడ్‌బ్యాక్, మార్కెట్ సవాళ్లపై చర్చ చేశారు.ఇందులో భాగంగా ఇటీవలే జిందాల్ గ్రూప్ అనుబంధ సంస్థ జిందాల్ ఇండియా స్టీల్ టెక్ లిమిటెడ్ (జిస్టిల్) ఒడిశా రాష్ట్రం, దెంకనల్‌లో స్థాపించబోయే రూ.15,000 కోట్ల విలువైన గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ కోసం ప్రభుత్వం నుండి అనుమతి పత్రం (ఎల్ వో ఏ) పొందినట్లు సంస్థ వెల్లడించింది.ఈ ప్రాజెక్ట్ యొక్క తొలి దశలో రూ.3,600 కోట్ల పెట్టుబడి జరగనుందని సమాచారం. మిలాప్ -బలమైన సంబంధాలకు వేదిక"మిలాప్ వంటి కార్యక్రమాల ద్వారా మేము మా రిటైలర్ భాగస్వాములతో సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉత్తమ ఉత్పత్తులను పరిచయం చేస్తున్నాం. తూర్పు మరియు దక్షిణ భారత మార్కెట్లలో మేము మా స్థిరమైన ఉనికిని మరింతగా విస్తరించ డమే లక్ష్యం" అని సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపారు.

# బిఎల్వోలకు శిక్షణ తరగతులు పూర్తి



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 11 :** ఎలక్షన్ కమిషన్ అదేశాల మేరకు మండల పరిధిలో బిఎల్ఓలకు కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్లో జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో పూర్తయినట్లు తాహసిల్దార్ కె.జె.ప్రకాష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ మండలంలో 62 మంది బిఎల్వోలు ఉన్నారన్నారు. ఇందులో వీఆర్వోలు, సచివాలయంలోని వివిధ శాఖల అధికారులు ఉన్నారన్నారు. వారందరికీ రెండు రోజుల పాటు తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వడం జరిగింద న్నారు. ముందుగా వారిలో 31 మందికి బుధవారం శిక్షణ ఇవ్వగా, మిగిలిన 31 మందికి శుక్రవారం శిక్షణకు హాజరైనట్లు ఆయన వివరించారు. అనంతరం అనుభవజ్ఞులైన శిక్షకులు జి.ఎస్.చక్రవర్తి, వైవివి రమణ మాట్లాడుతూ బిఎల్వోలు విధి నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వివిధ పారాలను ఫుల్ ఫిల్ చేయడానికి అవసరమైన విధానాలను, వాటికి సంబంధించిన సర్టిఫికెట్ల సేకరణను వివరించారు. ఇదంతా వారికి ఆన్ స్క్రీన్ మీద వాక్యాల రూపంలో తెలియజేసి శిక్షణ పూర్తి చేసామన్నారు. వారందరికీ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులు అయినట్లుగా అర్హత పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి సుబ్బరాజు, ఆర్ఐ రమాయమ్మ, బి.గుమస్తా సుబ్రహ్మణ్యం, సి.గుమస్తా చిన్ని, బిఎల్వోలు పాల్గొన్నారు.



## పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు

- కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ హెచ్చరిక




**కిర్లంపూడి, పెన్ పవర్,11 :** ఆటో డ్రైవర్ లు పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కిర్లంపూడి ఎస్సై జి. సతీష్ హెచ్చరించారు. శుక్రవారం కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో ఉన్న ప్రగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆటోలు నడిపే ఆటో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యూనిఫాం,డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్, కలిగి ఉండడంతోపాటు వాహన పత్రాలు సక్రమంగా ఉండాలన్నారు.విద్యార్థులను ఆటోలో డ్రైవర్ పక్కన,చెక్కలపైనా, వెనుక వైపు కూర్చోబెట్టరాదన్నారు. విద్యార్థులను చేరవేసే ఆటోలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

- వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 11 :** మండల కేంద్ర మైన కిర్లంపూడిలో మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయ వంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి శాసనమండలి ప్రతిపక్ష నేత, ఉభయగోదావరి జిల్లాల వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా ముఖ్య అతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆయా నియోజక వర్గాల ఇన్చార్జిలు పాల్గొంటారని తెలిపారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికే బొత్స సత్యనారాయణ, దాడిశెట్టి రాజా ఈ కార్యక్రమంలో పాల్గొని నాయకులకు కార్యకర్తలకు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు,ఎంపిటిసిలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.

## జూనియర్ కళాశాల శిథిల భవనాలను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 11 :** ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిల భవనాలను కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. కళాశాలలో కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రిన్సిపల్ రూమ్,తరగతి గదులను ఆసాంతం పరిశీలించారు. కళాశాల స్థితిపై ఎమ్మార్వో కేజే ప్రకాష్ బాబు, ఎంపీడీవో రాజు, కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కళాశాల స్థితిగతులను పరిశీలించడం జరిగిందని, సదరు అంశాలన్నీ కలెక్టర్ కు నివేదిక రూపంలో అందజేయనున్నట్లు తెలిపారు.

## ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 11 :** ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన పాలకవర్గం గౌరవాధ్యక్షులుగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యవహరించనున్నారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జనసేన పార్టీకి కేటాయించడంతో మడికి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు కొత్తపల్లి వెంకటలక్ష్మి ని చైర్ పర్సన్ గాను ఆలమూరు టిడిపి నాయకుడు కేతా రాంబాబు ఉపాధ్యక్షులుగాను నియమించారు. కమిటీ సభ్యులుగా ఆకుల రామాంజనేయులు, చింతలపూడి శ్రీనివాస్ కుమార్, దూలం మంగ లక్ష్మి, గాడా మంగ,కాలా సత్యవేణి, కొమ్ము దేవి, నామాల సూర్యనారాయణ మూర్తి, రాయుడు నాగరామదుర్గ, టేకుమూడి సీతారామలక్ష్మి, తోరాటి సత్య కిషోర్, వెత్సా సుబ్బారావు,గుత్తుల నాగేశ్వరరావు, దండే శ్రీదేవి లను నియమించారు. అలాగే సభ్యులుగా మోదుకూరు పిఏసిఎస్ అధ్యక్షుడు,ఆలమూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, ఆలమూరు సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియమాకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# పెద్దేరు వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం.. భయాందోళన వ్యక్తం చేస్తున్న జనం..



**వై.రామవరం, పెన్ పవర్,జూలై 11 :** రెండు మండలాల సరిహద్దులో ఉన్న పెద్దేరు వంతెనకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జనం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డతీగల,వై రామవరం మండలాల సరిహద్దులో ఉన్న పెద్దేరు పై 1964లో బ్రిడ్జి నిర్మించారని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఇసుక బకాసురులు వంతెన సమీపంలోనే నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను దేవేస్తున్నారని తెలిపారు. గతంలో రెవెన్యూ,పోలీస్, ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. మైనింగ్ అధికారులు అస్సలు పట్టించుకున్న దాఖలాల లేవని ఆరోపిస్తున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా 500 మీటర్ల దూరం పైనే ఇసుకను సేకరించాలని గతంలో ట్రాక్టర్ల యజమానులకు అధికారులు అల్టిమేట్ కూడా ఇచ్చారని తెలిపారు. కానీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇసుక బకాసురులు వంతెన సమీపంలోనే ఇసుకను తోడే స్తున్నారని అంటున్నారు. ఏ ఒక్క అధికారి స్పందించక పోవడంతో పెద్దేరు వంతెనకు ప్రమాదం సంభవించే పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. వంతెన కు ఏ విధమైన ప్రమాదం సంభవించిన రెండు మండలాలకు రాకపోకలు స్తంభించిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పెద్దేరు వంతెన సమీపంలో ఇసుకను సేకరించకుండా చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.



# రైతులకు తేనెటీగలు పెంపకం పై అవగాహన



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 11 :** కొబ్బరి, అరటి తోటల్లో తేనెటీగల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చునని కృషి వల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ అధ్యక్షుడు గణపతి వీర రాఘవులు, సంకల్ప సేవా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రత్న కిషోర్ అన్నారు. అంబాజీపేట కృషి వల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో తేనెటీగల పెంపకంపై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు . కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ కొబ్బరి, అరటి తోటల్లో అదనపు ఆదాయంతో పాటు నిరంతరం ఆదాయం సమకూర్చుకోవడానికి తేనెటీగల పెంపకం చక్కటి అవకాశమని రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ తేనెటీగల పెంపకం ఉపయోగ పడుతుందన్నారు. తేనెను ఉత్పత్తి చేసి వ్యాపారం చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా స్థిర పడవచ్చని సూచించారు. ఎకరా కొబ్బరి తోటలో రైతులు 10 పెట్టెలో తేనెటీగల పెంపకాన్ని చేపట్టడం ద్వారా 45 రోజులకు 120 నుంచి 150 కిలోల తేనె ఉత్పత్తి చేయవచ్చు అన్నారు.

ప్రస్తుత మార్కెట్లో స్వచ్ఛమైన తేనెకు డిమాండ్ ఉన్న దృష్ట్యా కిలో 600 నుంచి 650 వరకు ధర పలుకుతుందని రత్న కిషోర్ వివరించారు ప్రకృతి పరంగా ఉత్పత్తి చేయడం ద్వారా ఆరోగ్యానికి మంచిదన్నారు. ఎకరానికి 10 పెట్టెలలో తేనెటీగలను పెంచడం ద్వారా 40 వేలు ఖర్చు అవుతుందని పెట్టుబడి పోను రాబడి మూడు నెలలలో నెలకు 15,000 చొప్పున రైతులు లాభాన్ని ఆర్జించవచ్చని అన్నారు. అనంతరం సంకల్ప సేవ ఫౌండేషన్ డైరెక్టర్లు సునీల్ శశాంక, గుబ్బల విక్రమ్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు ముత్యాల జమ్మిలు, దంగేటి గిరిధర్, నెట్టాల సాయిరాం, ముత్యాల సత్తిబాబు, ఉప్పుగంటి భాస్కరరావు, శివరామకృష్ణ రాజు, పిల్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా పెరుగుదలను నియంత్రించాలి

## - చిన్న కుటుంబం చింతలేని కుటుంబం



**కూనవరం,పెన్ పవర్,జూలై 11 :** ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజీవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజీవ్ జనాభా పెరుగుదలను నియంత్రించాలని,జనాభా పెరుగుదల వలన వచ్చేటువంటి నష్టాలను మరియు బిడ్డకి బిడ్డకి మధ్య వ్యవధి కనీసం మూడు సంవత్సరాలు ఉండాలని అన్నారు. దంపతుల తాత్కాలిక వ్యవధిని పాటించడానికి చిన్నచిన్న చిట్కాలు నోటి మాత్రలు, ఐయుడి నిరోదులు,కాపర్ టీ వంటి పద్ధతిలో పాటించి జనాభా నియంత్రణ కు సహకరించాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వాములు అవ్వాలని, ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు వెళ్లాలని చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు డి.శ్రీనివాస్, జి.సీతమ్మ, ఎంఎల్ హెచ్‌పిలు ఏఎన్ ఎంలు మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# అర్హులందరికి ప్రభుత్వ పథకాలు

## - మాజీ ఛైర్మన్ ప్రకాష్



**మండపేట. పెన్ పవర్. జూలై 11 :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని మండపేట పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ అన్నారు. మండపేట 10,14వార్డు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. రాబోవు రోజుల్లో చేయబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వార్డులో ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని శ్రీ వర ప్రకాష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉంగరాల రాంబాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు మచ్చ నాగు,10వ వార్డ్ ప్రెసిడెంట్ సబిటి అనిల్, సిరంగు ఈశ్వర్, శెట్టి రవికుమార్ , సాధనాల చక్రపాణి, పిట్ట రాజబాబు, బదుగు రత్నరాజు, నిమ్మలపూడి వినాయకరావు, నిమ్మలపూడి గణేష్, ముత్యాల మెహర్ సుబ్బారావు, బర్రె దుర్గాప్రసాద్, విజయేంద్ర ప్రసాద్ ,క్లస్టర్ ఇంచార్జ్ బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే వైసీపీ నాయకులు మా ప్రశ్నలకు సమాధానం చెప్పండి

## - టిడిపి నాయకుడు బొదిరెడ్ల సుబ్బారావు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 11:** దమ్ముంటే వైసీపీ నాయకులు మా ప్రశ్నలకు సమాధానం చెప్పి తమ స్థాయి కోసం మాట్లాడాలని కాకినాడ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు అన్నారు. శుక్రవారం జగ్గంపేట టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండు రోజుల క్రితం జగ్గంపేటలో వైసిపి నాయకులు మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను సుబ్బారావు తీవ్రంగా ఖండించారు. జగ్గంపేట మండల పార్టీ వైసీపీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా అనే వ్యక్తి స్థాయికి మించి మాట్లాడరాదని అనడంపై సామాన్యుడు రాజకీయం చెయ్యకూడదా అని సుబ్బారావు ప్రశ్నించారు. ఆరోజు మీయొక్క సమావేశంలో మీ యువ నాయకుడు వయసుకు మించి మా ఎమ్మెల్యేను ఏవో మాటలు అంటూ ఉంటే పక్కనున్న మీరు ఇది తప్పు అని చెప్పలేరా అప్పుడు మీకు స్థాయి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. మీ స్థాయి మీరు గుర్తు తెచ్చుకోవాలని నేనైతే మా నాన్న బొదిరెడ్ల తాతారావు, పంతం పద్మనాభం దగ్గర నుంచి రాజకీయం చేయడం మొదలైందన్నారు. మీ స్థాయి ఏంటో ఇప్పటికైనా తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. కోడిపందాలు సంప్రదాయ క్రీడని సంక్రాంతి పండుగలో ఎవరైనా పాల్గొంటారని తెలియజేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గతంలో మీ ప్రభుత్వంలా ఇసుక మొత్తం వైసిపి కార్యకర్తలు దోచుకు తినడం లేదన్నారు. పేదవాడి ఇల్లు కట్టుకుంటే ఉచితంగా సామాన్యుడికి ఇసుకందించే ప్రభుత్వం మాది అన్నారు. అదేవిధంగా పెద్దలను గౌరవించాలనే సంస్కారం మీ యువ నాయకుడికి నేర్పించాలని సూచించారు. ఇటీవల జరిగిన మినీ మహానాడులో మేమంతా తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం పేరును మార్చాలంటూ తీర్మానం చేయడం జరిగిందన్నారు. అయితే మా యువ నాయకుడు జ్యోతుల నవీన్ కుమార్ దీనిపై స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది నేను అంగీకరించినని, పెద్ద మనసుతో ఆ పేరును ఏమాత్రం తొలగించేందుకు కుదరదని తీర్మానాన్ని తిరస్కరించడం జరిగిందని గుర్తు చేశారు. ఇది సంస్కారవంతమైన నాయకుడు లక్షణం అన్నారు. ముఖ్యంగా కరుటూరి శ్రీనివాస్ అనే వైసీపీ నాయకుడిని గత 15 సంవత్సరాలుగా నేను జగ్గంపేట నియోజకవర్గం లో చూడలేదన్నారు. ఈ మధ్యకాలంలో ఆయనకు ఒక పదవి ఇవ్వడంతో అభివృద్ధి ముసుగులో అవినీతి కనపడలేదా అనడం జరిగిందని అయితే మామిడాడ గ్రామంలో సొంత పొలంలో మట్టి మైనింగ్ వాళ్లకు బిల్లులు చెల్లిస్తూ తోలుకోవడం జరుగుతుందన్నారు. నిజంగా అక్కడ అవినీతి జరిగితే అదే గ్రామ సర్పంచ్ మీ వైసీపీ నాయకుడే అవసరమైతే మీరు వచ్చి చూసుకోండి అంటూ సవాల్ విసిరారు. చంటిబాబు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మీరు చెరువుపై పోరాడారని ఆయన అనడం ఆ అంశం హైకోర్టులో ఉండటం వల్ల దానిని ఎవరూ మాట్లాడడానికి సరిపోరన్నారు. అవసరమైతే మాజీ ఎమ్మెల్యే మీరు వైసీపీలోనే ఉన్నారు కనుక ఆయనతోనే మాట్లాడుకుని వివరణ తెలుసుకోవాలన్నారు. మీరు ఎంత మాట్లాడినా ప్రతిదానికి సమాధానం చెప్పేందుకు నేను సిద్ధంగా ఉన్నానని దమ్ముంటే మీరు నన్ను ప్రశ్నించండి అని సవాల్ విసిరారు. ముఖ్యంగా మా యువ నాయకుడు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు పెళ్లి చేసుకునే వధువు వరుడుకు 20వేల చొప్పున లక్షల రూపాయల్లో అందిస్తున్న ఘనత మా నాయకుడికే దక్కిందన్నారు. ఏనాడైనా మీ నాయకుడు ఒక్క రూపాయి ఎవరికైనా ఇచ్చిన పాపన్న పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు గండే కాశీ, సుమన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వల్లి, తెలుగు యువత ఉపాధ్యక్షులుబద్ది సురేష్, వీరబత్తుల జగన్ తదితరులు పాల్గొన్నారు..

# పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం



**మండపేట. పెన్ పవర్ జూలై 11 :** పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర రావు అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కపిలేశ్వరపురం మండలం, తాతపూడి, కపిలేశ్వర పురం, అంగర, పడమరఖండ్రిక గ్రామాలలో ఇంటింటా పర్యటించారు. ప్రతీ ఇంటిని సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి బాగోగులు, వారికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకున్నారు. చాలా మంది ప్రజలు ఇళ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత గల పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్ళ స్థలం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టనుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరతామన్నారు. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. పథకాలు పొందిన లబ్దిదారులు ఎనలేని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. భవిష్యత్ కాలంలో ప్రతీ ఇంటిలో ఓ ఉద్యోగి ఉండాలన్నది, పేదరికం లేని కుటుంబాలు ఏర్పడాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్నది కేవలం అబూత కల్పన ఆరోపణలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పై తప్పుడు ప్రచారాలు మానుకూవాలి

## - వైఎస్సార్‌సీపీ నాయకులు



**గంగవరం, పెన్ పవర్, జూలై 11 :** రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన తమ నాయకులపై మండల కూటమి నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలని రంపచోడవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు తాతపూడి ప్రకాశ్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యెజ్జు వెంకటేశ్వరరావు ఎంపిపి కృష్ణారెడ్డి హితవు పలికారు. శుక్రవారం సాయంత్రం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు తాతపూడి ప్రకాశ్ మాట్లాడుతూ ఏజన్సీలో ప్రతీ గిరిజనుడి అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏమి చేసిందో తెలుసునని, మా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పై కూటమి నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు.

గడిచిన ఐదేళ్లల్లో రంపచోడవరం నియోజకవర్గంలో రహదార్ల అభివృద్ధికి, గ్రామల్లో మౌళిక సౌకర్యాలు కల్పనకు, గిరిజన సంక్షేమానికి, గ్రామల్లో సమస్యల పరిష్కారానికి రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు ఎంతో కృషి చేశారన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులపై బురదజల్లే కార్యక్రమాన్ని మానుకోకపోతే రాబోయే కాలంలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతో మండల కూటమి నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ హయంలో నియోజకవర్గం, మండల స్థాయిలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. ఆసుపత్రులు, రహదార్లు గ్రామాలు ఎంతో అభివృద్ధిని సాధించాయన్నారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి కూటమి నాయకులు ఏదో చేసామని చెప్పుకుంటున్నారని, చేసింది ఏమీ లేదన్నారు. జగనన్న పథకాలను పేర్లు మార్చి, ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

పేద ప్రజలు అభ్యున్నతికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసింది ఏమీ లేకపోయినా కూటమి నాయకులు కల్ల బొల్లి కబుర్లు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని గంగవరం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు విమర్శించారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేసి అప్పుడు కూటమి నాయకులు మాట్లాడాలన్నారు. జెడ్పీటీసీ బేబీ రత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మి, కనకలక్ష్మి, సర్పంచులు కె.అక్కమ్మ, కె.లక్ష్మి, నేషం మరిడమ్మ, రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సూరంపూడి ఏడుకొండలు, మండల ఇన్‌ఛార్జ్ సిహెచ్.రఘున్యాద్, నాయకులు బాబ్జి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతుసేవా కేంద్రాల్లో "అన్నదాత సుఖీభవ"అర్హుల జాబితాలు

## - మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్



**గంగవరం, పెన్ పవర్, జూలై 11 :** అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచడం జరిగింది అని వ్యవసాయ అధికారి కె విశ్వనాథ్ తెలిపారు. అర్హతలు ఉండి, జాబితాలో పేర్లు లేకపోతే,13 వ తారీఖు లోపు రైతు భరోసా కేంద్రాల్లో గ్రీవెన్స్ పెట్టుకోవాలన్నారు. అందుకు రైతు సేవా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ లను సంప్రదించాలన్నారు. కౌలు చేసుకొనే భూమిలేని గిరిజన రైతులు, కౌలు కార్డుల కొరకు సంబంధిత వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్ లను సంప్రదించాలన్నారు.

# గోదావరి ఉధృతి-గండి పోచమ్మ ఆలయం ముంపులోకి...

## ఆలయ పరిసర రహదారులు నీట మునిగి రాకపోకలకు అంతరాయం.. షాపుల్లోకి ప్రవేశించిన వరద-వ్యాపారులు తహతహ..

## సురక్షిత ప్రాంతాలకు సరుకులు తరలిస్తున్న వ్యాపారులు.. భక్తుల రాకను నిలిపిన అధికారులు-ఆలయ ప్రాంగణంలో ప్రవేశం నిషేధం..



**దేవీపట్నం,పెన్ పవర్, జూలై11 :** గోదావరి పర్యాటన కాదు.. పరవళ్లు తొక్కే ప్రవాహం ఇప్పుడు భక్తుల విశ్వాసాలపై విరుచుకుపడుతోంది. దేవీపట్నం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి పోచమ్మ తల్లి ఆలయం పరిసరాల్లో గోదావరి నీరు పెరిగిపోతూ ఆ స్థలాన్ని పూర్తిగా ముంచేస్తోంది. పెరుగుతున్న వరద ఉధృతి కారణంగా ఆలయ పరిసర రోడ్లు పూర్తిగా మునిగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పుణ్యక్షేత్రం దగ్గర ఉన్న అనేక చిన్న పెద్ద షాపుల్లోకి వరద నీరు ప్రవేశించి వ్యాపారులకు కలవరమే కాకుండా ఆస్తినష్టం తెచ్చిపెడుతోంది. తమ దుకాణాల్లో ఉన్న సరుకులను గల్లంతు కాకుండా రక్షించుకునేందుకు వ్యాపారులు హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని,ఆలయానికి భక్తులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వందలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే గండి పోచమ్మ ఆలయం ఏటా ఇలాగే నీటిమునిగే దుస్థితి ఎదుర్కొంటోంది. గత ప్రభుత్వాలు ఆలయ అభివృద్ధిపై పెద్ద పెద్ద హామీలు ఇచ్చినా,అవి మాటలకే పరిమితమయ్యాయి. పనులు ప్రారంభం కావడం తేలిక కాదు,ప్రారంభమవకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఉందన్న ఆశతో భక్తులు ఎదురుచూస్తున్నారు. ఈసారి అయినా ఆలయానికి ఎప్పటికీ ముంపు ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని,తల్లి దర్శనానికి భక్తులకు ఎటువంటి అవరోధం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ గోదావరి ఉధృతి ప్రతి ఏడాది మళ్లీ పునరావృతమవుతోంది. కానీ మారేది మాత్రం వరద స్థాయి మాత్రమే...అధికారుల స్పందన మాత్రం మారడంలేదు అని స్థానికులు వేదన వ్యక్తం చేస్తున్నారు.



# రెండు కేజీల గంజాయితో వ్యక్తి అరెస్టు



**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, జూలై 11 :** రెండు కేజీల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తెలిపారు. దీనికి సంబంధించిన వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట జాతీయరహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కిర్లంపూడి గ్రామానికి చెందిన టి.రాజశేఖర్ గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్టు చేశా మన్నారు. దీనిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారని తెలిపారు. ఎవరైనా గంజాయిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టామని ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

## అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిట్టూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా కొర్లపాటి వెంకటేశ్వరరావు



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 11 :** అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్త ర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, చైర్మన్ గా అయినవిల్లి మండలానికి చెందిన టిడిపి నాయకుడు చిట్టూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ అంబాజీపేట కొర్లపాటివారిపాలెంనకు చెందిన జనసేన నాయకుడు కొర్లపాటి వెంకటేశ్వరరావు(ఢిల్లీ) సభ్యులుగా అడబాలసూర్యావతి, అంబటి గంగాభవాని, కముజు నాగసత్య కోసూరి పోసమ్మ, మట్టపర్తి సోమేశ్వరరావు, మేడిశెట్టి మంగతాయారు, మోర్త వీరవెంకట సత్యనారాయణ, నేదునూరి కుమారి, సలాది ప్రసాద్, గంధం వెంకటేశ్వరరావు, వక్కపట్ల ఆదిలక్ష్మి, దుర్గా శ్రీనివాసరావు, కుడుపూడి సత్యవేణి, అయినవిల్లి మండలం మాగం శ్రీ కేశవ స్వామి సొసైటీ చైర్మన్, పి.గన్నవరం అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, సర్పంచ్ మాచవరం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్ను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ ఆఫ్ఫో ప్రత్యేక కార్యదర్శి బి. రాజశేఖర్, ఉత్తర్వులు జారీచేశారు. పాలకవర్గం నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### నామినేటెడ్ పదవులన్నీ పూర్తి చేసి

## నేతల్లో నూతనోత్సాహం నింపాలి

### - టీడీపీ యువనేత బొక్కా ప్రసాద్



**కొత్తపేట పెన్ పవర్ జూలై 11 :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సుపరిపాలనకు మంచి పేరు తెచ్చుకుంటున్నదని కొత్తపేట నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు బొక్కా ప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలకు మద్దతుగా ఇప్పటికే వివిధ కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవులను ఎక్కువగా భర్తీ చేసినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, పట్టణ స్థాయిల్లో దేవాలయాలు, మార్కెట్ యార్డులు, సొసైటీలు, బ్యాంకులు, ఆసుపత్రులకు సంబంధించిన పదవులు ఇంకా ఖాళీగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ ఆలస్యం కారణంగా నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారిలో ఉత్కంఠ నెలకొన్నదని, పార్టీలో పని చేసిన కార్యకర్తల్లో కొంత అసంతృప్తి కనిపిస్తున్నదని ఆయన తెలిపారు. గత వైసీపీ పాలనలో చోటుచేసుకున్న అరాచకాలకు నిరసనగా టీడీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను బహిష్కరించిన నేపథ్యంలో, ప్రస్తుతం ఆ పదవుల్లో వైసీపీకి చెందిన నాయకులే కొనసాగుతున్నారని విమర్శించారు.

**బీసీలకు అన్యాయం, యువతకు గౌరవం కావాలి :** గత వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుండి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలకు రాజకీయంగా నష్టం వాటిల్లిందని బొక్కా ప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం బీసీ వర్గాలకు చెందిన నేతలు నామినేటెడ్ పదవులపై భారీగా ఆశలు పెట్టుకున్నారని, పదవుల నియామకంలో జరుగుతున్న ఆలస్యం వారిలో అసంతృప్తిని పెంచుతుందని తెలిపారు. అలాగే, వైసీపీ అక్రమాలను ఎదుర్కొంటూ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో యువత కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ, నామినేటెడ్ పదవుల్లో యువతకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఆవేదన కలిగిస్తున్నదని చెప్పారు.

**పదవుల ప్రక్రియను వేగవంతం చేయాలి :** కూటమిలో మూడు పార్టీలకు చెందిన కీలక నేతలకు నామినేటెడ్ పదవులు కేటాయించాల్సి ఉండటంతో ప్రక్రియ కొంత ఆలస్యమవుతోందని పేర్కొన్న బొక్కా ప్రసాద్, అయితే ఇక ఆలస్యం చేయకుండా మిగిలిన పదవుల్ని పారదర్శకంగా, సామాజిక న్యాయంతో నియమించాలని కోరారు. నామినేటెడ్ పదవుల ప్రక్రియ పూర్తయితే పార్టీకి అంకితభావంతో పనిచేసిన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపి, టీడీపీకి మరింత బలం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## మొల్లేరు సొసైటీ డైరెక్టర్‌గా నరమల శ్రీను



**గంగవరం, పెన్ పవర్ ,జూలై 11 :** గంగవరం మండలం మొల్లేరు ప్రాథమిక సహకార సంఘం సొసైటీ డైరెక్టర్ గా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరమల శ్రీను నియమించడం చాలా గర్వకారణంగా ఉందని బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బిజెపి మండల అధ్యక్షురాలు పుట్టపల్లి నీలాలమ్మ, జిల్లా ఎస్టి మోర్చా కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు దొర, బీజేవైఎం అధ్యక్షులు కుంజం రమేష్ దొర, బీజేవైఎం కార్యదర్శి కట్రం వెంకన్న దొర తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.11 :** మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద శుక్రవారం డాక్టర్,అనిల్ కుమార్,వైద్య శాల సిబ్బంది. ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించడం జరిగింది.అనంతరం వైద్య శాల సిబ్బంది. డెంగ్యూ,వ్యాధి పై అవగాహన ర్యాలీ చేశారు.కుటుంబ నియంత్రణ పద్ధతులను తెలుసుకొని ప్రతి ఒక్కరూ పాటించాలి.బాల్య వివాహాలు చేయకూడదు.వివాహ వయసు అమ్మాయిలకు 21సంవత్సరాలు పురుషులకు 25 సంవత్సరాలు వయస్సు ఉండాలి.సంతానం బిడ్డకు బిడ్డకు ఎడమ (దూరం) ఉండాలి.అలా ఉన్నట్లయితే పుట్ట బోయే పిల్లలు ఆరోగ్యం వంతులు ఉంటారు.గృహాలు చుట్టు ప్ర క్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి.ఆరోగ్యం మే మహా భాగ్యం నిల్వ ఉన్న నీరు దోమల కు పుట్టినిల్లు కూలర్,ఫ్రీజు,కొబ్బరి బొండాలు పుల్ల కుండీలు పనికి రాని వస్తువులు బోర్లించి పెట్టాలి.దోమల మందును గృహాలు లోన బయట పిచకారి చేయండి.దోమ తెరలను ప్రతి ఒక్కరూ గృహాల్లో వాడాలని,గ్రామాల ప్రజలకు అవగాహన ర్యాలీ ద్వారా తెలిపారు.ఈ కార్యక్రమంలోపి. హెచ్.ఎన్. భద్రకాళి హెచ్.వి.సీత హెచ్.ఎ.శ్రీనివాస్,సత్యనారాయణ రత్తయ్య,సతీష్ ఎం.ఎల్.హెచ్.పి.లు పవన్ మంగ అనూష ఎ.ఎన్.ఎం.లు చంద్రమ్మ బూబమ్మ,శ్రీవిద్య, భీమమ్మ,పార్వతి, అనూష,పార్వతి, ఆశలు,తదితరులు పాల్గొన్నారు.

# రూ.45 కోట్లతో గూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి

### - కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ వెల్లడి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 11 :** తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ ను రూ.45 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. గతంలో 27 కోట్లు నిధులు మంజూరు చేశామని ఇంకా అభివృద్ధి కోసం మరో 18 కోట్ల రూపాయలు అదనంగా కేటాయించామని కేంద్ర మంత్రి వర్మ చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు హైదరాబాదు, విశాఖపట్నం ప్రయాణానికి అందు బాటులో ఉండే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. మరో నెల రోజుల్లో వందే భారత్ తో రైలుకు గూడెంలో హాల్టు లభిస్తుందని ఆయన ప్రకటించారు. దీనిపై రైల్వే శాఖ మంత్రి తో కూడా మాట్లాడినట్లు చెప్పారు ఇప్పటికే తాడేపల్లిగూడెం ప్రాంతానికి మూడు ఆరోబీలు ఒక ఆర్యుబి మంజూరు చేశామని చెప్పారు. నాలుగు బ్రిడ్జిలు ఒక నియోజకవర్గానికి మంజూరు చేయడం విశేషం అన్నారు. నరసాపురం, అరుణాచలం స్పెషల్ ట్రైన్ వారాంతపు రైలు ఏర్పాటుకు మంచి స్పందన లభించింది అని పేర్కొన్నారు. వీరవాసరం రైల్వే స్టేషన్ లో అరుణాచలం రైలుకు త్వరలో హాల్టు లభిస్తుందని వెల్లడించారు. తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసును ఈ సందర్భంగా కేంద్రమంత్రి బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, మాజీ అధ్యక్షుడు తాతాజీ, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ, బిజెపి పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ ,ముప్పిడి సురేష్ రెడ్డి, రైల్వే జోనల్ కమిటీ సభ్యులు రవి అగర్వాల్, బిజెపి నాయకులు రామగాని సత్యనారాయణ , అయినం బాలకృష్ణ, పెదప్రోలు రాఘవులు కోటా రాంబాబు, జనసేన నాయకులు పాలూరు వెంకటేశ్వరరావు ,పుల్లా బాబి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలపై కావాలని దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు

### - ప్రభుత్వ పథకాలు చూసి ఓర్వలేకనే ఇటువంటి పనులు
### - గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడం చాలా దారుణం
### - ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ప్రకటన



**ఎటపాక ,పెన్ పవర్, జూలై 11 :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కొందరు వైకాపా నాయకులు దుర్బుద్ధితో చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తున్నట్లు ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గౌరిదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శు క్రవారం మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు వడ్డించే భోజనంలో అన్నం సరిగా ఉడకకపోవడంతో ఆహారం తిన్న 6గురు విద్యార్థులకు అరగక కడుపునొప్పి రావడం జరిగిందని , వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు స్పందించి ప్రక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించగా అంతా ఆరోగ్యంగానే ఇంటికి వెళ్లడం జరిగిందని వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు తెలిపారు. కొందరు తమ గ్రామానికి చెందిన వైకాపా నాయకులు కావాలనే పాఠశాలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇదే గ్రామం వైకాపాకు చెందిన ఆకుల నాగేంద్రరావు అనే వ్యక్తి కూతురు కూడా ఇదే పాఠశాలలో చదువుతుండగా , గురువారం జరిగిన పేరెంట్స్ - టీచర్స్ ఆత్మీయ సమావేశానికి మంచి స్పందన రావడం, వేడుక గొప్పగా జరగటం చూసి ఓర్వలేక నాగేంద్రరావు అనవసరమైన జోక్యంతో 4 మండలాల మీడియా (వాట్సాప్) గ్రూపులలో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు మెసేజ్ పెట్టాడని తెలిపారు. ఈ విషయంలో కనీసం ఉపాధ్యాయుల పాత్ర ఏమీ లేదని, పాఠశాలలో పనిచేస్తున్న వంట మనిషి అలివేలు నిర్లక్ష్యం ఇందుకు కారణమని తెలిసి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు గుండె సుధాకర్ హెచ్చరించి వెంటనే వంట మనిషిని సస్పెండ్ చేసి మరొక వంట మనిషిని నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. కానీ తల్లికి వందనం పథకం సక్సెస్ అయ్యి , పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ చూసి ఓర్వలేక తమ గ్రామంలోని వైకాపా వాళ్లు ఇటువంటి అసత్య ప్రచారం చేస్తున్నారని , ఇక్కడ ప్రమాదం ఏమీ జరగలేదని విద్యార్థులు దూరప్రాంతాల నుంచి వచ్చి హాస్టల్ లో జాయిన్ అయి మంచి చదువులు చదువుతుంటే ఓర్వలేని వైకాపా మూకలు ఈ విధంగా గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడం చాలా దారుణమని , దీనిని తాము పూర్తిగా ఖండిస్తున్నామని , ఎవరైనా ఇందులో పాత్రధారులు ఉంటే విచారించి చర్యలు తీసుకోవటానికి వెనకాడే సమస్య లేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అవకతవకలు జరిగిన తమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఊరుకునే సమస్య లేదు. ఈ ప్రభుత్వంలో ఎవరైనా ఎటువంటి ఘర్షణలు సృష్టించడానికి ప్రయత్నం చేసిన అధికార యంత్రాంగానికి తెలియజేయాల్సి ఉంటుందని , గ్రామంలో అనవసరమైన రాద్ధాంతం చేయవద్దని తెలియజేస్తున్నట్టు ఆయన పత్రికాముఖంగా తెలిపారు. ఈ ప్రకటనలో సర్పంచ్ ఉలవల శివకనకరాజు , ఉపసర్పంచ్ మడకం నరసింహారావు , స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు గుండె సుధాకర్లు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి సమన్వయతో పని చేయాలి




**గంగవరం, పెన్ పవర్, జూలై 11 :** గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ,జడ్పిటిసి బేబీ రత్నం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు కృషి చేయాలని అన్నారు. జడ్పిటిసి బేబీ రత్నం మాట్లాడుతూ మండలంలో రహదారులు, పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని ఆమె అన్నారు. గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ కె.ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్తు నిరంత రాయంగా సరఫరా చేయాలని కోతల లేని విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు కొన్ని సమస్యలను సమావేశం తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో లక్ష్మణ్ రావు తాసిల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో గ్రామాల అభివృద్ధి సంబంధించిన అభివృద్ధి పనులకు సంబంధించి 29 తీర్మానాలు సమావేశంలో ప్రవేశపెట్టారు వీటిలో ప్రధానంగా రహదారులు తాగునీటి సమస్యలు మండల పరిషత్ కార్యాలయం అభివృద్ధి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాదేవి, ఎంఈఓ మల్లేశ్వరరావు, ఆర్డబ్ల్యూ ఎస్ ఏ ఈ ఈ శ్రీనివాస్, నీతి అయోగ్ ప్రతినిధి హేమ మాధురి, డిప్యూటీ




ఎంపీడీవో నరసంగరావు, ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మి పద్మావతి ఆదినారాయణ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కొండ్రాజుపేట రహదారిపై వరద నీరు





### -10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి

**కూనవరం,పెన్ పవర్,జూలై 11 :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి,శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండలంలోని గోదావరి వరద నీరు కొండ్రాజుపేట రోడ్డుపై ప్రవహిస్తుండడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి.ఆ రహదారి గుండా 10 గ్రామాలు మండల కేంద్రానికి వచ్చే ప్రజలు పది కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.కొండ్రాజుపేట రహదారిపై వరద నీరు చేరిన సమాచారం తెలిసి స్థానిక తాసిల్దార్ కే శ్రీనివాస్,ఎస్ఐ లతాశ్రీ ఆ రహదారి వైపుగా గ్రామ ప్రజలు ప్రయాణించవద్దని తెలిపారు.శబరి బ్రిడ్జిపై గోదావరి,శబరి ప్రవాహాన్ని పరిశీలించారు.స్థానిక గ్రామ ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని అన్ని విధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### డ్వాక్రా సొమ్ము స్వాహా చేసిన వారిపై

# చర్యలు తీసుకోవాలి

### - సమనస ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్, తాలూకా ఎస్సైలకు కంప్లైంట్ చేసిన డ్వాక్రా మహిళలు

**అమలాపురం పెన్ పవర్ జూలై 11 :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి గ్రామానికి చెందిన గౌతమ్ మహిళా శక్తి సంఘం ప్రెసిడెంట్ అయిన పరమట శారద అనే మహిళ గ్రూప్ సభ్యులు అప్పు పొదుపు కట్టమని ఇచ్చినటువంటి డబ్బులను సుమారు ఒకలక్ష 76వేల రూపాయలు అవినీతికి పాల్పడిందని వాటిని చెల్లించమని అడిగితే మీకు దిక్కున కాడ చెప్పుకోండి కట్టేది లేదని గ్రూపు మహిళలపై తిరగబడటంతో గతి లేని స్థితిలో ఈరోజు స్థానిక ఎస్బిఐ మేనేజర్ మరియు అమలాపురం తాలూకా స్టేషన్ ఎస్ఐలకు డ్వాక్రా మహిళలు కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల క్రితం సమనసఎస్బిఐ బ్యాంకులో తొమ్మిది మంది సభ్యులు ఒక్కొక్కరికి 65 వేల రూపాయలు లోను మంజూరు చేశారని, వాటిని సభ్యులంతా ప్రతినెల అప్పు 2000 రూపాయలు పొదుపు 100 రూపాయలు చొప్పున కడుతున్నారని కొందరు సభ్యులు రెండు మూడు నెలలకు ఒకసారి కట్టేవారని అమౌంట్ ని ప్రెసిడెంటు అయిన పరమట శారద కి చెల్లించడం జరిగిందని ఆమె బ్యాంకులో జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వాడుకుందని పుస్తకాలు చూపిచమని అడిగినా చూపించకుండా తాత్సారం చేసేదని దీంతో గ్రూప్ సభ్యులంతా బ్యాంకుకు వెళ్లి చెక్ చేయించగా 2024 అక్టోబర్ నెలలో సుమారు 1, 76 వేల రూపాయలు బ్యాంకులో జమ చేయలేదని తేలిందని వాటిని చెల్లించాలని 2024 అక్టోబర్ నుండి కోరుతున్నప్పటికీ కూడా చెల్లించకుండా మహిళలపై దుర్భాషలాడుతుందని ఈ సందర్భంగా వారు వాపోయారు వన్నే చింతలపూడి గ్రామ సర్పంచ్ సమక్షంలో పలుమార్లు తగువు పెట్టినప్పటికీ కట్టకుండా గ్రూపు సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు సభ్యులు కట్టినటువంటి అప్పు వివరాలు పరిశీలించగా సుమారు 1, 76 వేల రూపాయలు వాడుకున్నట్టు నిర్ధారణలో తేలిందని గ్రామ సర్పంచ్ సమక్షంలో పలుమార్లు తగు పెట్టగా లక్ష రూపాయలు చెల్లించిందని 2024 అక్టోబర్ నాటి నుండి బ్యాంకు వడ్డీతో సహా అప్పు చెల్లిస్తానని గ్రూపు సభ్యులకు భార్యాభర్తలిద్దరూ పరమట శారద బాలరాజు రాతపూర్వకంగా రాసి ఇచ్చారని కానీ నేటికీ చెల్లించకుండా అడుగుతున్న మహిళలపై దుర్భాషలాడి మీకు దిక్కున కాడ చెప్పుకోండి అని అనడంతో సంవత్సరం కాలం ఎదురుచూసినటువంటి మహిళలు నేడు బ్యాంక్ మేనేజర్, తాలూకా ఎస్ఐ కు కంప్లైంట్ చేశారని తమకు న్యాయం చేయాలని మరమట శారద వల్ల మొత్తం మా గ్రూపు మొత్తం సభ్యులందరూ నష్టపోయామని పోలీసులు బ్యాంకు వారు కలగజేసుకొని తగు న్యాయం చేయాలని వారు ఒక ప్రకటనలో కోరారు ఈ ప్రకటన ఇచ్చినవారిలో గ్రూపు సభ్యులు గ్రూపు సెక్రటరీ బిరుదుగంటి వెంకాయమ్మ గ్రూపు సభ్యులు కారెంసత్యవతి పరమట రామలక్ష్మి చుట్టుగుళ్ళ కనకదుర్గ చుట్టుగుళ్ళ మరియమ్మ తదితరులు ఉన్నారు.

## జగ్గంపేట డిగ్రీ కళాశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 11 :** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వ ర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చెన్నారావు మాట్లాడుతూ విద్యార్థుల పురోగతిని పర్య వేక్షించడం, సమస్యలను గుర్తించడం, పరిష్కారాలను కనుగొనడం, విద్యార్థు లకు మెరుగైన విద్యను అందించడానికి కలిసి పనిచేయడంపై వివరించారు. విద్యార్థులకు సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, మత్తుపానీయాల పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి తరగతి ఉపాధ్యాయులు, ఆ తరగతి విద్యార్థుల పురోగతి గురించి తల్లిదండ్రులతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి.హెచ్.బాలరాజు, ఐ. క్యూ.ఏ.సి కో-ఆర్డినేటర్ పి.వి.వి. సర్యోనారాయణ, అకడెమిక్ కో-ఆర్డినేటర్ విశ్వశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొల్లపాలెంలో డ్రైనేజీ పనులను పరిశీలించిన సర్పంచ్, గ్రామ కమిటీ అధ్యక్షులు



**కాజులూరు,జూలై 11 పెన్ పవర్ :** కాజులూరు మండల పరిధిలోని గొల్లపాలెంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను శుక్రవారం పరిశీలించారు. టెలిఫోన్ కార్యాలయం నుండి కరగా రాంబాబు ఇంటివరకు జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలంటూ కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ ప్రసన్న మౌనిక సూచించారు.

## కానివాడలో ప్రత్యేక ఆధార్ ఎన్రోల్మెంట్ క్యాంప్



**వై.రామవరం, పెన్ పవర్, జూలై 11:** అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని కానివాడ సచివాలయం పరిధిలో ప్రత్యేక ఆధార్ ఎన్రోల్మెంట్ క్యాంపు నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టర్ ఆఫీసర్ ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిం చాలని ఆదేశించడం జరిగిందన్నారు. నేటి వరకు ఆధార్ కార్డు లేని ప్రతి ఒక్కరూ నమోదు కేంద్రానికి రావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో జనరేటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## కిర్లంపూడి జూనియర్ కళాశాలలో ఆర్ ఓ ప్లాంట్ ప్రారంభించిన తమలపల్లి రమేష్





**కిర్లంపూడి, పెన్ పవర్,జులై 11 :** మండల కేంద్రమైన కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన ఆర్ఓ ప్లాంట్ ను జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ,టి జోసెఫ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విమల, కిర్లంపూడి ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెచ్ఎం, రమణి కుమారి, పలువురు ఆధ్యాపకులు, ఉపాధ్యాయులు, గోనేడ, తామరాడ,ఎంపీటీసీలు అల్లు శివరామకృష్ణ, గోకేడ రాజా,యల్లపు దొరబాబు గంధం ప్రభాకర్, బోండా వెంకటరమణ, బోండా నందిబాబు, మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజుబాబు, సత్యనారాయణ, చిక్కాల భగవాన్, కాయల మణికంత, విజయ్,కురుమళ్ళ నాగేశ్వరరావు, వీరు, గంధం శ్రీను, కనకరాజు, అడ్డూరి పద్మరాజు, గంధం వంశీ తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూశాఖ దాడి

## అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం పట్టివేత

### ఎమ్మార్వో అల్లు సత్యనారాయణ నేతృత్వంలో 1,548 కేజీలు స్వాధీనం



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 11 :** పేదలకు సరఫరా చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన ఘటనలో 1,548 కిలోల బియ్యం ను రెవెన్యూశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీకి ఎమ్మార్వో అల్లు సత్యనారాయణ స్వయంగా నాయకత్వం వహించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన అధికారులు, తగిన చర్యలు చేపట్టి బియ్యం నిల్వలను గుర్తించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బియ్యం తరలింపుకు సిద్ధంగా ఉంచిన స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేసి, అక్రమ నిల్వను నిలువరించారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. ఎమ్మార్వో అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ "అర్హులైన ప్రజలకు అందించాల్సిన నిత్యావసర సరుకులను దారి మళ్లించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పథకాల నిబద్ధతను కాపాడేందుకు నిరంతరం చర్యలు కొనసాగుతాయి" అని స్పష్టం చేశారు.

## ఆక్వా జనరల్ ట్రైనింగ్ ప్రోగ్రాం...



**అమలాపురం/సఖినేటిపల్లి పెన్ పవర్, జూలై 11 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో ఎంపీ ఈ డి ఏ సబ్-రీజనల్ డివిజన్ కాకినాడ నాకా సహకారంతో 09 నుండి 11 వరకు జనరల్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎంపీ ఈ డి ఏ జే టి ఓ బంగారం ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రోగ్రాంలో మాప్డా స్కీమ్స్ , కల్చర్ ఆక్టివిటీస్, ఫామ్ ఎన్రోల్మెంట్ కోసం డిస్కస్ చేశారు. అలాగే ఫీల్డ్ మేనేజర్ పి సునీల్ కుమార్ మాట్లాడుతూ కోపరేటివ్ సొసైటీ వాటి బెనిఫిట్స్ కోసం, సీడ్ సబ్సిడీ స్కీమ్స్, క్లస్టర్ ఫార్మేషన్, నక్సా ఎంపెడ ల్యాబ్ వాటి ఉపయోగాలు గురించి వివరించారు. రాజేష్ ఆక్వా లైసెన్స్ రెన్యువల్స్ కోసం తెలియజేశారు. 25 మంది రైతులు తో 3 రోజులు శిక్షణ కార్యక్రమాన్ని ముగింపు, లబ్ధిదారునికి ఆక్వాకల్చర్‌లో వైవిధ్యీకరణ, మెరుగైన యాజమాన్య యాజమాన్య పద్ధతులు శిక్షణా శిబిరంను రైతులు చక్కగా వినియోగించుకున్నారు. కార్యక్రమం లో ఎఫ్టిఓ నుకేష్, సర్పంచ్ పోతురాజు నరసింహారావు కిషోర్, నల్లా కిరణ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలుపై ప్రత్యేకం



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 11 :** ఏలేశ్వరం నగర పంచాయతీ పట్టణ పరిధిలో మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి అభ్యంతరాలు, సలహాలు తెలుపవలసిందిగా కమిషనర్ శుక్రవారం సాయంకాలం 3 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్ పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశానికి పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలేశ్వరం పట్టణ పరిధిలో మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని, పట్టణంలో రోడ్ల విస్తరణకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రణాళిక అధికారి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఏలేశ్వరం పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేయడానికి (జి ఐ ఎస్ బేస్డ్) భౌగోళిక సమాచార వ్యవస్థ ఆధారిత డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు.

దీనిలో భాగంగా మండల పరిధిలోని లింగంపర్తి, యర్రవరం, తిరుమాలి ,సి.రాయవరం ఏలేశ్వరం మున్సిపాలిటీలో విలీన గ్రామాల్లో ప్రణాళిక అమలు చేయడానికి సిద్ధం చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ అమలులో రహదారుల విస్తరణ పై ప్రజలకు అవగాహన కల్పించడం సమావేశం అన్నారు. రహదారుల విస్తరణలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే సంబంధిత సంబంధిత వ్యక్తులు తమకు తెలియజేయాలన్నారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. రోడ్ల విస్తరణలో ఆయా భూములకు సంబంధించిన రైతుల నుండి అభ్యంతరాలు ఉంటే కార్యాలయం పని వేళల్లో తెలియజేయాలన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్ బాబు, మునిరపు నాగేశ్వర రావు, సహాయ ప్లానింగ్ అధికారి కృష్ణారావు, జూనియర్ ప్లానింగ్ అధికారి శివరామకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి జెడి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 11:** స్థానిక ఆర్టీసీ డిపో మెయిన్ గేటు వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి యూబిఎం కుమార్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయం గా ఎంప్లాయిస్ యూనియన్ పనిచేస్తుందని అన్నారు. నేడు యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షతన డిపో అధ్యక్షులు బి నాని బాబు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ కృష్ణ ఆధ్వర్యంలో 80 మంది కార్మికులతో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ 1952 సంవత్సరంలో జులై 11న కార్మిక సంఘంగా 215 రిజిస్ట్రేషన్ తో సంఘం ఏర్పడిందన్నారు. యూనియన్ మొదటి అధ్యక్షులు సయ్యద్ ఖాసీమ్ అని, ఇప్పటివరకు 20 ఒక రోజులు పని చేస్తేనే కానీ వీక్లీ ఆఫ్ వచ్చేది కాదని ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం వల్ల వారానికి ఒక ఆఫ్ సాధించామని, యూనియన్ పోరాటం వల్ల ఎనిమిది గంటల పని దినాన్ని సాధించామన్నారు. ఆర్టీసీ కార్మికులకు మొట్టమొదటి వేతన సవరణ ఒప్పందాన్ని సాధించిన ఘనత ఈ యు దేనని, 1953 యూనియన్ ఆధ్వర్యంలో 16 రోజుల సమ్మె చేశామని ఇది యూనియన్ చరిత్రలోనే ఒక మైలు రాయి అన్నారు. ప్రభుత్వం మొండిగా వేతనాలు పెంచకపోయిన ప్రివిలేజ్, బస్సు పాసులు, క్యాజువల్ వర్కర్లను, రెగ్యులర్ చేయించడం, సమాన పనికి సమాన వేతనం, యాక్సిడెంట్లు జరిగినప్పుడు డ్రైవర్లు కోర్టులో వాదించుకోవడానికి ఆర్థిక సహాయము, డ్రైవర్లకు ఇతర రక్షణలు లభించిన అగ్రిమెంట్లు కూడా ఇదే సంవత్సరంలో మేనేజ్మెంట్ చేత అంగీకరింప చేయడం జరిగిందన్నారు. 1967 లోనే తొలి ఐక్య ఉద్యమాన్ని ఆర్టీసీలో నిర్వహించి ఐక్య ఉద్యమం సారధిగా పేరు గడించడం జరిగినది. 2001 లో సంస్థ మనుగడ కోసం 24 రోజులు సమ్మె చేశామని 2015లో 8 రోజులు సమ్మె చేసి 43 శాతం పే స్కేలు సాధించిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ అన్నారు. 2013 -14 ఎన్ క్యాష్మెంట్ ఎనిమిది శాతం వడ్డీతో ఇప్పించిన ఘనత కూడా తమదేనని తెలిపారు. 2013 పే స్కేలు, ఏరియర్లు ను కూడా ఒక రూపాయి నష్టపోకుండా ఇప్పించామని, 2017 వేతన సవరణ అప్పటి గుర్తింపు సంఘం చేయలేకపోతే 2018లో గుర్తింపులోకి వచ్చిన ఎంప్లాయిస్ యూనియన్ 25 శాతం ఫిట్మెంట్ చేయడం జరిగిందని, ఆర్టీసీలో 14 సార్లు వేతన సవరణ జరిగితే 9సార్లు చేసిందని, గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న పదోన్నతులు కోసం 11వ పి ఆర్ సి లో 24 నెలలు పెండింగ్ ఏరియాలను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ వి రావు, గంగ, జి ఎస్ నారాయణ, ఎల్ వి ఎస్ నారాయణ, విజయ, గ్యారేజీ చలం, ప్రసాదు, నల్ల శ్రీను, సిహెచ్ లోవరాజు,గంటా శ్రీను, బూరుగుపూడి రాజు, జక్కా శ్రీను, వీరవరం శ్రీను, ఎల్ వి ఎస్ నారాయణ, బి ఆర్ ఎల్ రావు తదితరులు పాల్గొన్నారు.

### గొల్లపాలెం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు

## భోజనం వడ్డించిన గ్రామ సర్పంచ్, కూటమి నేతలు

### విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి : నక్క శ్రీను





**కాజులూరు,జూలై 11 పెన్ పవర్ :** కాజులూరు మండల పరిధిలోని గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, గ్రామ కమిటీ అధ్యక్షులు నక్క శ్రీను, కోకా హరిబాబు,ఈలి వీరలక్ష్మి అంగర శ్రీను,వార్డు మెంబర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు. వారు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారికి నాణ్యమైన ఆహారం అందుతోందా అనే దానిపై అవగాహన పొందారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను విద్యార్థుల పుస్తకాలు పరిశీలించి, పాఠశాలలో పాఠ్యబోధన ఎలా జరుగుతోందో తెలుసుకునేందుకు విద్యార్థులను వ్యక్తిగతంగా అడిగి వారి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడి తమ ప్రతిభను చాటుకోవాలి అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని సబ్జెక్టులలో ప్రావీణ్యం కలిగినవారుగా తీర్చిదిద్దేందుకు నిబద్ధతతో పని చేయాలి అని సూచించారు. గొల్లపాలెం హైస్కూల్ ఇతర ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలనే దిశగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి అని నక్క శ్రీను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆసక్తి పెంచడమే కాక, సమాజంలో ప్రభుత్వ విద్యాసంస్థలపై విశ్వాసాన్ని బలపరిచేలా సాగిందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# ఘనంగా మడకం వారి పెళ్లి వేడుక



- టిడిపి పార్టీ మండల కమిటీ నాయకులు
- కుంజావారిగూడెం,కొత్తపేట గ్రామ పెద్దలు
- వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష్,కుమార్

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.11 :** మండలంలోని వి.ఆర్.పురం పోలీసు స్టేషన్,వద్ద శుక్రవారం ఎస్.ఐ. సంతోష్, కుమార్,సూచనల మేరకు కుంజా వారి గూడెం,కొత్తపేట,గ్రామ పెద్దలు ద్వారా టిడిపి మండల కమిటీ నాయకులు జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి బురక కన్నా రావు,నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్ రావు, ఉపసర్పంచ్ ఆకోజ్ భాగ్యలక్ష్మి, బురక సారయ్య, బోధిబోయిన సురేష్,తదితర సమక్షంలో పెళ్ళి కుమారుడు, వరుడు తరుణ్, పెళ్ళికూతురు వధువు దుర్గ భవాని,ఇరువురుకు కూనవరం మండలం టేకులుబోరు సాయి బాబా దేవాలయంలో ఘనంగా మడకం వారి పెళ్ళివేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంజావారి గూడెం కొత్తపేట గ్రామ పెద్దలు టిడిపి మండల కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న 47 మందిపై కేసు




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 11 :** విద్యాసంస్థలకు వంద మీటర్ల లోపు పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ వైఆర్ కే శ్రీనివాస్ హెచ్చరించారు. జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో విద్యాసంస్థలకు దగ్గరగా ఉన్న షాపులను జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లో ఎస్సైలు రఘునాథరావు, సతీష్, శివ నాగబాబు శుక్రవారం విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న జగ్గంపేటలో 15 మంది, గండేపల్లి లో 15 మంది, కిర్లంపూడి లో 12 మంది పై కలిపి మొత్తం 47 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వారికి రూ.9400 జరిమానా విధించామని సీఐ తెలిపారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

## పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలి

### పంచాయతీ కార్యదర్శి డి.రాజు



**రావులపాలెంపెన్ పవర్ జూలై 11 :** వెధిరేశ్వరం గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. గ్రామ ప్రజల్లో ప్రత్యేకించి మహిళల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో, పంచాయతీ కార్యదర్శి డి. రాజు నేతృత్వంలో గురువారం ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తడిచెత్త - పొడిచెత్త వేరు చేయడం వల్ల పారిశుధ్య నిర్వహణ సులభమవుతుందని తెలిపారు. చెత్తను విభజించి ఇచ్చేందుకు ప్రజలు అలవాటు పడాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ ఐవీఆర్ఎస్ కాల్స్ ప్రాధాన్యతను మహిళలకు వివరించారు. ఈ కాల్స్ ద్వారా ప్రభుత్వం ప్రజలకు పంపించే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**పారిశుద్ధ్య కార్మికులు డోర్ టూ డోర్ సేవలు :** ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని పలు వీధుల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ చేపట్టారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకి తరలించి పరిసరాలను శుభ్రంగా ఉంచే పనిలో నిమగ్నమయ్యారు.

**ప్రజల సహకారం అవసరం :** గ్రామ పరిశుభ్రత కొరకు స్థానిక ప్రజల సహకారం అవసరమని డి. రాజు తెలిపారు. చెత్తను నిర్దేశిత సమయంలో, వేరు చేసి ఇవ్వడం ద్వారా గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు సహాయపడవచ్చని పిలుపునిచ్చారు.

## విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

**సీతానగరం, పెన్ పవర్, జూలై 11 :** సీతానగరం మండలంలోని ముగ్గళ్ళ 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని శనివారం మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీ ఎల్ ఈఈ ఎన్ శ్యామల్ తెలిపారు, వెదుళ్ళపల్లి రాజంపేట మునికూడలి గ్రామాల్లో సరఫరా నిలిచిపోతుందన్నారు.

### కృంగిపోయిన గొయ్యి ఏర్పడ్డ కల్వర్టుకు మరమత్తులు షురూ...





**ఎటపాక, పెన్ పవర్, జూలై 11 :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్కు కూతవేటు దూరంలో గత రాత్రి బుధవారం రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతను ఎటపాక సబ్ ఇన్స్పెక్టర్ అప్పలరాజు పోలీస్ సిబ్బందితో కలిసి కల్వర్టు పక్కనే ఉన్నటువంటి పెద్దగుంటను సిమెంటు మరియు ఇసుక బస్తాలతో గుంత చుట్టుప్రక్కల అమర్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు, శనివారం ఏర్పడిన గుంతను తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి అధికారులు జెసిబిల సహాయంతో కల్వర్టును పూర్తిగా ఒక సైడు పెక్కిలించి కల్వర్టు మరమ్మత్తులను ప్రారంభించారు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ గేట్లు పెట్టి రవాణా సౌకర్యం కల్పించారు.

## విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

**సీతానగరం, పెన్ పవర్, జూలై 11 :** సీతానగరం మండలంలోని ముగ్గళ్ళ 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని శనివారం మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీ ఎల్ ఈఈ ఎన్ శ్యామల్ తెలిపారు, వెదుళ్ళపల్లి రాజంపేట మునికూడలి గ్రామాల్లో సరఫరా నిలిచిపోతుందన్నారు.

# సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తరలింపు సరికాదు

● విద్యార్థుల లేనంటూ సాకుతో కళాశాల రద్దు చేయడాన్ని నిరసిస్తూ ప్రకటన
● కాంగ్రెస్ నేత కారే శ్రీనువాసు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 11:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి అనుబంధంగా కొనసాగుతున్న సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను తరలించాలన్న నిర్ణయం సరికాదని, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కారే శ్రీనువాసు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. స్థానికంగా పత్రికా విలేకరులతో మాట్లాడిన ఆయన, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణాన్ని చూపించి ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం తీసుకున్న కళాశాల రద్దు నిర్ణయాన్ని తిరస్కరించారు."ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. ఇలాంటి ప్రాంతానికి చెందిన యువతకు వ్యవసాయ విద్య ద్వారా మార్గదర్శనం కావాల్సిన సమయంలో, విద్యా అవకాశాలను మరింతగా విస్తరించాల్సిన సమయంలో కళాశాలను తరలించటం అన్యాయమైందే" అని అన్నారు.ప్రభుత్వాలు గతంలో ఎన్నో కృషులు చేసి ఏర్పాటు చేసిన సంస్థలను, ఇప్పటి అధికారులు వివిధ సాకులతో తొలగించాలనుకోవడం తగదన్నారు. అభివృద్ధి ప్రారంభ దశలో ఉన్న చింతపల్లి వంటి ప్రాంతాలలో ఈ విధంగా ప్రభుత్వ సంస్థల తరలింపు గ్రామీణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తుందని పేర్కొన్నారు.సేంద్రీయ వ్యవసాయ సాగుకు ముఖ్య కేంద్రంగా జిల్లాను ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రకటించిన నేపథ్యంలో, ఇక్కడ ఉన్న సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కొనసాగించాల్సిన అవసరం మరింతగా ఉందని అన్నారు. ఇది స్థానిక రైతులకు, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ అందించే దిశగా దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.జిల్లా పరిపాలన, విశ్వవిద్యాలయ అధికారులు మరియు రాష్ట్ర ప్రభుత్వం చింతపల్లిలోనే కళాశాల కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు."ఇది సమగ్ర జిల్లా అభివృద్ధికి అవసరమైన నిర్ణయం అవుతుంది" అని కారే శ్రీనువాసు ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేవవరపు రాజబాబుకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు పల్ల కేరి బృందం



**పాయకరావుపేట పెన్ పవర్ జూలై 12:** ఇటీవల పాయకరావుపేట పిఎసిఎస్ చైర్మన్ గా నాయకులు దేవరపు రాజాబాబు తెలుగుదేశం పార్టీ నుండి బాధ్యతలు తీసుకున్నందుకుగాను శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పల్లా విలియం కేరి బృందం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సాల్వతో సత్కరించి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని రాష్ట్ర హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత అడుగుజాడల్లో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వేములపూడి అప్పారావు సీనియర్ నాయకులు సీకోలు కొండబాబు అడ్వకేట్ నెలపర్తి నాగేశ్వరరావు యువ నాయకులు బోడపాటి శ్రీను తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కేరి అన్న యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు స్పందించిపరిష్కారం

● జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కు 11 వినతులు
● జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూలై-11 :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కి సంబంధించి 11 వినతులు వచ్చాయ ని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరం లో సిపి లు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న %ూ+=ూ% కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చీఫ్ సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 11 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 01, 3వ జోన్ కు 02, 4వ జోన్ కు 01, 5వ జోన్ కు 01, 6వ జోన్ కు 03, 8వ జోన్ కు 02 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యా దులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

# రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులకు శంకుస్థాపన





● నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి
● భీమిలి ఎమ్మెల్యే గంటా

**భీమిలి, పెన్ పవర్, జూలై 11 :** ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 1 వ వార్డు బాలాజీనగర్ పాచిపేటలో రూ.57 లక్షల తో నిర్మించనున్న రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-19 మధ్యలో రూ.4,700 కోట్లతో భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని.. ప్రతి గ్రామంలోనూ రోడ్లు, డ్రెయిన్లు, కళ్యాణ మండపాలు, ఆస్పత్రులు నిర్మించామని వివరించారు. అందుకు ధీటుగా అభివృద్ధి చేసి, 93 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రజలు అభివృద్ధి మాటే మర్చిపోయారని, టిడిపి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులే ఇప్పటికీ కనబడుతున్నాయని పేర్కొన్నారు. స్వార్థ ప్రయోజనాలతో అవాంతరాలు సృష్టించాలని ప్రయత్నించినా పాచిపేటలో రోడ్డు నిర్మాణం జరిగి తీరుతుందని..గ్రామస్తులు కోరిన విధంగా రేషన్ డిపో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇళ్ల స్థలాల అవకతవకల ఆరోపణలపై దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. సుప రిపాలనలో తొలి అడుగు ప్రచారం, సుపరిపాల నలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాచిపేట గ్రామంలో ఎమ్మె ల్యే గంటా శ్రీనివాసరావు ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే సంక్షేమం ఆగిపోతుందని జగన్మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేశారని, వైసీపీ ప్రభుత్వాన్ని మించి సంక్షేమాన్ని అందించి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నామని తెలిపారు. రూ. 2 వేల పెన్షన్ ను రూ. 3 వేలకు పెంచడానికి జగన్మో హన్ రెడ్డికి అయిదేళ్లు పట్టిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రూ. 3 వేల పెన్షన్ ను రూ. 4 వేలకు పెంచి చిత్తశుద్ధి నిరూపించుకుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా.. 67 లక్షల మందికి తల్లికి వందనం అందించామని వెల్లడిం చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమ్మిన సూరిబాబు, కొప్పుల రమేష్, గాడు అప్పలనాయుడు, దండు వెంకటేష్, నరవ రామారావు, దొంతల సూర్య, అనురాధ, ఎమ్మార్వో రామారావు, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసం మూడవ శుక్రవారము విశేష పూజలు!



ఆలయ ప్రాంగణంలో మందికి అన్న ప్రసాద వితరణ!




**బిమిలి, పెన్ పవర్, జూలై 11:**మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరం గ్రీష్మ ఋతువు ఆషాడం మాసం బహుళ పక్షం పాడ్యమి మూడవ శుక్రవారం సందర్భంగా ఉదయం అమ్మవారికి నిత్య అర్చనలతో ప్రారంభమై కుంకుమార్చన, పుష్పార్చన మొదలగు పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, మూర్తి శర్మలు తదితరులు నిర్వహించి కర్పూర హారతి నీరాజన మంత్ర పుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు, సాయంత్రం వేళలో అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అమ్మవారిని అలం కరించి ప్రత్యక పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి కర్పూర హారతి సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజే శారు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ఆలయ ప్రాంగణంలో దీపారాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు,

ఈ సందర్భంగా మధురవాడ పిలకవానిపాలెం వాస్తవ్యులు శాన్న లక్ష్మణ రావు, వరక్ష్మీ దంప తులు ఏర్పాటు చేసిన పులిహోర ప్రసాదం అమ్మవారికి నైవేద్యంగా నివేదించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు,ప్రతీ శుక్రవారం కనీసం వంద మందికి అన్న ప్రసాదం ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సంకల్పంలో భాగంగా ఈరోజు శుక్రవారం విజయనగరం జిల్లా నందిగాం వాస్తవ్యులు (మధురవాడ స్వతంత్ర నగర్ నివాసి) పోతిన అప్పారావు, లక్ష్మి దంపతులు ఆర్థిక సహాయంతో ఆలయంలో (300) మూడు వందల మంది భక్తులకు, పేదలకు అన్న ప్రసాదం (అన్నసంతర్పణ) నిర్వహించారు,


ఈ కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పిల్లా సూరిబాబు, సెక్రటరి నాగోతి తాతారావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోతిన శివ, కమిటీ సభ్య లు పిల్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, పిల్లా రమణ, బంక వాసు, పిల్లా సన్యాసిరావు , పిల్లా రాజు,ముఖ్య సభ్యులు పిల్లా పోతరాజు, పిల్లా వెంకటరమణ, పిల్లా అప్పన్న, వాండ్రాసి అప్పారావు, పిల్లా సూరి పాత్రుడు, సుందర వెంకటరావు, శ్రీను, పిల్లా తమ్ము నాయుడు, దుక్క అప్పారావు, పోతిన రాంబాబు, ఆలయ సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, జూలై 11 :** ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.



# పార్టీలకతీతంగా వాసుపల్లి సేవలు.

టిడిపి వార్డు నేతకు రూ. 5000 ఆర్థిక సాయం.



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూలై 11 :**దక్షిణ నియోజకవర్గంలో నిస్వార్థ సేవలు అందించే మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పార్టీలకు అతీతంగా 33వ వార్డుకు చెందిన టిడిపి నేతకు రూ. 5000 మెడికల్ ఖర్చులకు అందజేశారు. ఆసీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం రమేష్ రెడ్డికి సొంత నిధులతో ఐదు వేల నగదును అందజేశారు. టీడీపీ పార్టీలో విశేషాలు అందించి ఇటీవల షుగర్ వ్యాధి వలన తన ఎడమ కాలును తొలగించడం జరిగింది. విషయం తెలుసుకున్న వాసుపల్లి గణేష్ కుమార్ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆయనకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కులం మతం, పార్టీ చూడకుండా సేవ చేయాలన్న జగనన్న ఇన్సిరేషన్ తో తోచిన సహాయం అందించగలుగుతున్నానని చెప్పారు. నిస్వార్థ ప్రజా సేవతోనే నాయకుడు కాగలడని, స్వార్థపూరిత రాజకీయాలు తనకు మొదటి నుండి అలవాటు లేదని ఈ సందర్భంగా వాసుపల్లి తెలిపారు. తనను నమ్మిన ప్రజలకు కార్యకర్తలకు ఎప్పుడు అండగా నిలవడమే తన లక్ష్యమని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అంగనవాడి వైస్ ప్రెసిడెంట్ కొల్లి సత్యవతి , సౌత్ అంగనవాడి ప్రెసిడెంట్ కొణతాల కృష్ణవేణి, అరుగుల రాజు,కోరాడ సురేష్, పిల్లి అజయ్ రెడ్డి చింతకాయల వాసు, గంగళ్ల రామరాజు, బూరెల చిన్న, తమ్మినేని శీను తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే వైయస్ఆర్‌సీపీ కార్యకర్త దారుణ హత్య

శ్రీకాకుళం జిల్లాలో దారుణం

**శ్రీకాకుళం జిల్లా:పెన్ పవర్, జూలై 11** ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట గ్రామ సమీపంలో పట్టపగలే దారుణ హత్య జరిగింది. గ్రామంలోని నేషనల్ హైవే సర్వీస్ రోడ్డుపై వైయస్ఆర్‌సీపీ కార్యకర్త, ఉప సర్పంచ్ సత్తారు గోపి (35) దారుణ హత్యకు గురయ్యాడు. రాళ్లు, కర్రలతో దుండగులు తల, శరీర భాగాలపై కొట్టి అతన్ని హతమార్చిన ఘటన పట్టపగలు నడిరోడ్డుపై జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ హత్య వెనుక టీడీపీ కార్యకర్తలు ఉన్నారని వైయస్ఆర్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

సత్తారు గోపి వైయస్ఆర్‌సీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ క్రియాశీలక కార్యకర్తగా గుర్తింపు పొందాడు. ఎన్నికల ఫలితాల తర్వాత కొద్ది రోజులకే అదే గ్రామంలో మరో వైయస్ఆర్‌సీపీ కార్యకర్త కూన ప్రసాద్ హత్యకు గురైన ఘటన స్థానికంగా ఉద్రిక్తతను రేకెత్తించింది. ఈ రెండు హత్యల వెనుక రాజకీయ కక్షలే కారణమని వైయస్ఆర్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. హత్య జరిగిన ప్రాంతంలో బాధితుడి బంధువులు, వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేసినప్పటికీ, ఈ ఘటన స్థానికంగా భయాందోళనలను రేకెత్తించింది. వైయస్ఆర్‌సీపీ నాయకులు ఈ హత్యను టీడీపీ నాయకులు ప్రోత్సహించిన దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు.వైయస్ఆర్‌సీపీ నాయకులు ఈ ఘటనపై తీవ్ర స్పందన వ్యక్తం చేస్తూ, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చట్టం, లా అండ్ ఆర్డర్ పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, రెడ్ బుక్ రాజ్యాంగంలో యథేశ్చగా హత్యలు, అరాచకాలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు. "సత్తారు గోపి హత్య రాజకీయ కక్ష సాధింపు చర్య. టీడీపీ కార్యకర్తలు బహిరంగంగా హత్యలకు పాల్పడుతున్నా, ప్రభుత్వం, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ హత్యలపై వెంటనే నిష్పక్షపాత విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు 'గ్రీన్ పాస్ పోర్టులు'.. కూటమి వినూత్న కార్యక్రమం




**హైదరాబాద్  పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మూడేళ్లలో కోటి మొక్కలు నాటాలనే లక్ష్యంతో పాఠశాలల విద్యార్థులను భాగస్వామ్యం చేసింది. గురువారం నిర్వహించిన మెగా పేటీఎంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి ఒక మొక్కను పంపిణీ చేయనుంది. ఆ మొక్కతోపాటు గ్రీన్ పాసుపోర్టు ఒకటి అందజేసింది. ఈ పాసుపోర్టులో విద్యార్థి వివరాలతోపాటు ఆ విద్యార్థికి అందజేసిన మొక్క పేరు, అది నాటిన ప్రదేశం, మూడు నెలలకు ఒకసారి దాని పురోగతిని నమోదు చేయాలని ఆదేశించింది. విద్యార్థులకు సామాజిక బాధ్యత అలవరడంతోపాటు పచ్చదనం పెరిగేలా ఈ పథకానికి రూపకల్పన చేసింది. మెగా పేటీఎం కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమైన ఉపాధ్యాయులు మొక్కలు పెంపకంపైనా వారితో చర్చించారు. 4వ తరగతి నుంచి ఆపై తరగతుల వారికి ఈ బాధ్యతను అప్పగించింది. విద్యార్థులు మొక్కలు పెంచడం ద్వారా ఐదు మార్కులు పొందనున్నారని ప్రభుత్వం తెలిపింది. విద్యార్థులు మొక్కలను ఎలా పెంచుతున్నారనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా గ్రీన్ కార్డులను తయారు చేయించిన ప్రభుత్వం వాటిపై ఉపాధ్యాయులు ఏటా రెండు సార్లు సంతకాలు చేయాలని సూచించింది. 'మొక్క పెరుగుదలతో నా ప్రయాణం' అనే క్యాప్షన్ తో తయారు చేసిన గ్రీన్ కార్డులు విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క' స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు చెబుతున్నారు.

# 'కృతజ్ఞతలు'.. రాజీనామా ఆమోదంపై రాజాసింగ్ రియాక్షన్



**హైదరాబాద్  పెన్ పవర్:** బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి తాను చేసిన రాజీనామాను హైకమాండ్ ఆమోదించడం పట్ల.. తెలంగాణ కమలం పార్టీ నాయకు డు, ఫైర్‌బ్రాండ్, ఘోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. – కృతజ్ఞతలు – అంటూ.. ఆయన పోస్టు చేశారు. అయితే.. ఈ సందర్భంగా ఆయన తన ఫ్యూచర్ ప్లాన్‌ను పేర్కొన్నారు. తాను హిందూత్వ కోసమే పుట్టానని.. తన చివరి శ్వాసవరకు కూడా హిందూత్వ కోసమే పనిచేస్తానని తెలిపారు. 11 సంవత్సరాల కిందట తొలిసారి తాను బీజేపీలో చేరానని.. అనేక ఇబ్బందులు పడ్డా.. హిందూత్వ కోసం పనిచేశానని రాజా సింగ్ తెలిపారు. పార్టీ తనకు మూడు సార్లు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చిందన్న ఆయన ఘోషా మహల్ ప్రజలు తనను మూడు సార్లూ గెలిపించారని.. పేర్కొన్నారు. తనకు మూడుసార్లు టికెట్ ఇవ్వడం పట్ల బీజేపీ జాతీయ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాను చేసిన రాజీనామాను ఆమోదించడం పట్ల తనకు బాధలేదన్నారు. అయితే.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలన్నదే తన లక్ష్యమని.. ఈక్రమంలో ఎంతో మంది కార్యకర్తలు..అలుపెరుగ కుండా పనిచేస్తున్నారని.. ఈ విషయాన్ని జాతీయ నాయకత్వానికి తెలియజేయాలన్న ఉద్దేశమే తనకు ఉందన్నారు. కానీ.. ఆ పనిచేయలేక పోయానన్నారు. తాను పదవుల కోసం.. అధికారం కోసం పార్టీని వదులు కోలేదని చెప్పారు. చివరి శ్వాస వరకు హిందుత్వం కోసమే పనిచేస్తానని తెలిపారు. తాను హిందువుగా పుట్టినందుకు.. ఆ సమాజం కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు.

**ఇలాంటి ఫైర్ ఉంటుందా?**

రాష్ట్ర విభజన నేపథ్యంలో బీజేపీలో చేరిన రాజాసింగ్ అప్పటి వరకు ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తగా, ఏబీవీపీ నాయకుడిగా వ్యవహరిం చారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుస విజయాలు దక్కించుకున్నారు. ఒకానొక సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆయన ఒక్కరే బీజేపీ తరఫున విజయం సాధించారు. అయినా.. అసెంబ్లీలోబలమైన వాణి వినిపించారు. ఫైర్ బ్రాండ్ రాజకీయాలను బీజేపీకి పరిచయం చేసిన ఘనత కూడా ఆయనదే.అంతేకాదు.. విషయం ఏదైనా తనదైన శైలిలో విరుచుకుపడడం, ఏటికి ఎదురీడడం రాజా స్టయిల్. రాజకీయాల్లో నాయకులు ఎంతో మంది వస్తుంటారు..పోతుంటారు. పార్టీల్లోనూ అంతే. కానీ.. రాజాసింగ్ వంటి ముక్కుసూటి నాయకుడు.. ఫైర్ ఉన్న నేతలు లభించడమే కాదు.. వారిని తట్టుకోవడం కూడా.. పార్టీలకు కష్టమే!. ఇదే.. రాజా రాజకీయాలకు ఒకరకంగా ప్లస్ అయితే.. మరికొన్ని రకాలుగా మైనస్ అయిందనేది పరిశీలకులు చెబుతున్న మాట.

# ఐటీ, రియల్ ఎస్టేట్ బూమ్‌తో ఈ జిల్లాకు వలసల వెల్లువ

**హైదరాబాద్  పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుండగా జిల్లా జనాభా గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్రంలో పారిశ్రామికంగా, రియల్ ఎస్టేట్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో రంగారెడ్డి ముందు వరుసలో నిలుస్తోంది. ఇదే కారణంగా ఇక్కడ నివాసానికి వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువవుతోంది.

**2011 నుంచి ఇప్పటి దాకా జనాభా పెరుగుదల**

2011 జనాభా లెక్కల ప్రకారం రంగారెడ్డి జిల్లాలో మొత్తం 24,46,265 మంది నివసించేవారు. వీరిలో 12,54,184 మంది పురుషులు కాగా, 11,92,081 మంది మహిళలు. కానీ ఆ తర్వాతి సంవత్సరాల్లో జిల్లా అభివృద్ధి చెందడం, ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల జనాభా విపరీతంగా పెరిగింది. 2023 నవంబర్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తాజా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 18 ఏళ్ల పైబడిన ఓటర్ల సంఖ్య ఏకంగా 35,23,219 కు చేరింది. ఇది చూసినప్పుడు మొత్తం జనాభా 48 లక్షల వరకు చేరిందని జనగణన నిపుణులు అంచనా వేస్తున్నారు.

**వలసలతో వేగంగా పెరుగుతున్న జిల్లా**

హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ఈ జిల్లాలో ఐటీ కంపెనీలు, పరిశ్రమలు పెరిగాయి. దీంతో ఉద్యోగ అవకాశాల కోసం రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడకు వలస వస్తున్నారు. అంతేకాదు హౌసింగ్ ప్రాజెక్టులు, అపార్ట్‌మెంట్ల బూమ్ కారణంగా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. ఇవన్నీ కలిసే జిల్లాలో జనాభా వేగంగా పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

# తప్పుకోవాలంటున్న ఆర్ఎస్ఎస్...మోడీ గురించేనా ?



**హైదరాబాద్  పెన్ పవర్:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ షార్ట్ కట్ లో ఆర్ఎస్ఎస్. వందేళ్ళ ఈ సంస్థకు ఎన్నో అంగాలు ఉన్నాయి అందులో రాజకీయ అంగమే బీజేపీ. బీజేపీ విధి విధానాలను శాసించేది ఆర్ఎస్ఎస్ అన్నది అంతా అంటారు. ఈ రోజున బీజేపీలో ఉన్న కీలక నాయకులు అంతా ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారే. ప్రధాని నరేంద్ర మోడీ హోంమంత్రి అమిత్ షా, నితిన్ గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్, తెలుగు నాట చూస్తే వెంకయ్యనాయుడు, కిషన్ రెడ్డి వంటి వారు అంతా ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారే. ఆర్ఎస్ఎస్ అంటే మార్గదర్శిగా బీజేపీ భావిస్తుంది. అలాంటి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ళు నిండిన వారు రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఆయన కామెంట్స్ చేశారు. వయసు ఏడున్నర పదులు దాటితే ఆ నాయకులు ఇక విశ్రాంతి తీసుకోవాలని కొత్త వారిని బాధ్యతలు అప్పగించాలని మోహన్ భగవత్ అన్నారు.

మనకు ఎవరైనా 75 ఏళ్ళ వయసు వచ్చిందని శాలువా కప్పారు అంటే ఇక గౌరవంగా తప్పుకోమని అర్థమని కూడా ఆయన చెప్పారు. వయసు పెరిగాక రాజకీయ నాయకులు హుందాగా తప్పుకోవాలని ఇతరులకు దారి చూపించాలని ఆయన కోరారు.ఆయన ఈ విధంగా చేసిన కామెంట్స్ ఇపుడు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఎందుకంటే ఆయన జనరల్ గా అన్నా కూడా అందరి కంటే ఎక్కువగా బీజేపీకే అవి వర్తిస్తాయని అంటున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ గా ఆయన మార్గదర్శకత్వం చేసేది బీజేపీకే కాబట్టి ఆ పార్టీ నాయకులకే ఈ వ్యాఖ్యలు శిరోధార్యంగా ఉండాల్సి ఉంటుందని అన్నారు.

ఈఅ మోహన్ భగవత్ వ్యాఖ్యలను ఒక్కసారి పరిశీలిస్తే కనుక ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోడీని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. నరేంద్ర మోడీ ప్రస్తుతం వయసు 74 ఏళ్ళు. ఈ ఏడాది సెప్టెంబర్ 17తో ఆయనకు 75 ఏళ్ళు నిండుతాయి. అంటే ఆ ఏజ్ వచ్చాక స్వయంగా మోడీ ప్రధాని పీఠం నుంచి తప్పుకుని ఇతరులకు అది అప్పగించాలని పరోక్షంగా సూచించారా అన్న చర్చ అయితే సాగుతోంది.అయితే ఈ విషయంలో బీజేపీ నేతలు మాత్రం జనరల్ గా చేసిన వ్యాఖ్యలుగానే చూస్తున్నారు. ఇక బీజేపీలో చూస్తే చాలా మంది నాయకులను 75 ఏళ్ళు మీరారు అని లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయించకుండా గతంలో తప్పించారు అని గుర్తు చేస్తున్నారు. బీజేపీ ఈ రోజున ఈ రూపంలో ఉంది అంటే దానికి అన్ని విధాలుగా నారూ నీరూ పోసిన వరిష్ట నేత ఎల్ కే అద్వానీని 75 దాటారు అనే 2019లో లోక్ సభ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదని అంటున్నారు. అలాగే మరో సీనియర్ నేత బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు అయిన మురళీ మనోహర్ జోషీ విషయంలోనూ పక్కన పెట్టారని అంటున్నారు.ఇలా చాలా మందిని వయసు కారణంగా పార్టీ సేవలకు దూరంగా ఉంచిన ఈ నిబంధన ఇపుడు బీజేపీలో నడుస్తోందా అంటే లేదని అన్న వారే ఎక్కువగా ఉన్నారు. మోడీతోనే బీజేపీ అన్నట్లుగా ఇపుడు పరిస్థితి ఉంది. ఒక విధంగా చెప్పాలీ అంటే మోడీయే బీజేపీ అన్నట్లుగా కూడా ఉందని అంటారు. దాంతో మోడీకి ఈ నిబంధన వర్తించదని అంటున్న వారూ ఉన్నారు. అంతే కాదు బీజేపీలో వయసు నిబంధన ఏదీ లేదని చెబుతున్నారు.

అయితే మోహన్ భగవత్ అన్నది మాత్రం అందరి గురించేనా లేక మోడీ గురించా అన్నది అయితే చర్చగా ఉంది. బీజేపీలో ఒకనాడు 75 ఏళ్ళ విధానం అమలు చేసి ఇపుడు కాదు మాకు లేదు అంటే దానిని సమర్థించుకోవడమూ కష్టమే అని అంటున్నారు. మోడీ ఇప్పటికే మూడు సార్లు ప్రధానిగా ఉన్నారు.అయితే ఆయనకు ఈ టెర్మ్ లో అయితే మధ్యలో విరమించుకోవడం వంటిది ఉండకపోయినా 2029 నాటికి మాత్రం ఆయన ప్రధాని అభ్యర్థి కారు అన్నది చెప్పాలన్నదే ఈ వ్యాఖ్యల ఉద్దేశ్యమా అని కూడా విశ్లేషించేవారు ఉన్నారు. ఏది ఏమైనా మోడీ మరింత కాలం ప్రధానిగా ఉంటారని బీజేపీలో వాదన ఉంది. మోడీ ఎపుడు కావాలనుకుంటే అపుడే రాజకీయాల నుంచి తప్పుకుంటారని కూడా అంటున్నారు. ఇక చూస్తే కనుక బీజేపీకి ఆర్ఎస్ఎస్ కి ఏమైనా గ్యాప్ ఉందా లేదా అన్నది ఈ వ్యాఖ్యల తరువాత జరిగే పరిణామాల బట్టి అర్థం అవుతుందని కూడా అంటున్నారు.

# విదేశీ మీడియాకు అజిత్ దోవల్ సంచలన సవాల్... ఇది వేరే లెవెల్!



**హైదరాబాద్  పెన్ పవర్:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్ కు నష్టం కలిగిందంటూ విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్ సీరియస్ గా స్పందించారు. ఇందులో భాగంగా... పాక్ దాడుల్లో భారత్ కు నష్టం కలిగిందని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు.

అవును... ఆపరేషన్ సిందూర్ భారతదేశానికి గర్వకారణమైన క్షణం అని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ప్రశంసించారు. ఈ సమయంలో పాక్ చేసిన దాడుల్లో భారత్ కు నష్టం జరిగిందనే విదేశీ మీడియా నివేదికలను ఆయన తోసిపుచ్చారు. భారతీయ ఆస్తుల విధ్వంసం గురించి ఒక్క చిత్రాన్ని అయినా, కనీసం పగిలిన గాజు ముక్కనైనా చూపించాలని ఆయన సవాలు చేశారు.

తాజాగా ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో మాట్లాడిన అజిత్ ధోవల్... ఈ ఆపరేషన్ 23 నిమిషాల పాటు జరిగిందని.. సరిహద్దుల సమీపంలోనూ, సరిహద్దుకు దూరంగా పాకిస్తాన్ లోపల సరిగ్గా తొమ్మిది నిర్దేశించిన లక్ష్యాలను భారత సైన్యం ఛేదించిందని అన్నారు. దీనికోసం ఉపయోగించి స్వదేశీ పరిజ్ఞానం విషయంలోనూ తాము ఎంతో గర్వపడుతున్నామని అన్నారు.భారత సైన్యం జరిపిన దాడుల్లో పాకిస్థాన్ లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫోటోలు బయటకు వచ్చాయి కానీ.. భారత్ కు నష్టం జరిగినట్లు ఒక్క ఫోటో కూడా లేదని అజిత్ ధోవల్ వ్యాఖ్యానించారు. భారత్ కు చెందిన ఆయుధ స్థావరాలపైనా మన సైన్యం చిన్నగీత కూడా పడనివ్వలేదని అన్నారు. ఈ నేపథ్యంలోనే సవాల్ విసిరారు.

ఇదే సమయంలో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయని చెప్పిన దోవల్... పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థమంతంగా అడ్డుకున్నట్లు తెలిపారు.

కాగా... జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం లో పాకిస్తాన్ మద్దతుతో జరిగిన ఉగ్రవాద దాడిలో బైసరన్ లోయలోని 25 మంది పర్యాటకు, ఒక స్థానికుడు మరణించిన సంగతి తెలిసిందే. దీంతో... దీనికి ప్రతీకారంగా మే 7న భారత ఆపరేషన్ సిందూర్ అంటూ ప్రతీకార దాడి చేసింది. 23 నిమిషాల ఈ మెరుపుదాడితో పాక్ లోని ఉగ్రవాదులు వణికిపోయారు. ఈ సమయంలో పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని తొమ్మిది కీలక ఉగ్రవాద స్థావరాలపై భారత వైమానిక దళం దాడులు చేసింది. వాటిలో బహావల్ పూర్ లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం, మురిడ్కేలోని లష్కరే తోయిబా కీలక స్థావరం ఉన్నాయి. ఈ దాడిలో సుమారు 100 మంది వరకూ ఉగ్రవాదులు మరణించినట్లు చెబుతున్నారు!దీనికి ప్రతిస్పందనగా.. పాకిస్తాన్ డ్రోన్, క్షిపణి దాడులతో భారత్ పై ఎదురుదాడికి ప్రయత్నించింది. అయితే వాటన్నింటినీ భారతదేశ గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలోనే పాక్ దాడుల్లో భారత్ కు నష్టం వాటిల్లిందంటూ విదేశీ మీడియా చేస్తోన్న ప్రచారంపై అజిత్ దోవల్ స్పందించారు. పగిలిన గాజు ముక్కైనా చూపించాలని సవాల్ విసిరారు.

# మర్డర్ కి కారణం ఈ వీడియోనేనా?



**హైదరాబాద్  పెన్ పవర్:** గురుగ్రామ్‌లో టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. అత్యంత దారుణంగా... ఆమె సొంత తండ్రి దీపక్ యాదవ్ చేతిలోనే మరణించడం ప్రజలను షాక్‌కు గురి చేసింది. ఈ సంఘటన వెనుక అసలు కారణం ఏంటన్న దానిపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నా... తాజాగా వెలుగులోకి వస్తున్న వివరాలు విషాదానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**హత్యకు దారితీసిన 'వీడియో' వివాదం?**

రాధికా ఓ యువకుడితో కలిసి తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయని సమాచారం. అదే సమయంలో ఆమె ఎక్కువగా రీల్స్ చేయడం, సోషల్ మీడియాలో ఎక్కువగా సమయాన్ని గడపడం, ఆర్థికంగా స్వతంత్రంగా మారడం తండ్రికి ఇష్టం లేకపోయినట్లు చెబుతున్నారు. ఆ వీడియో ఇంట్లో పరువును దిగజార్చిందని దీపక్ భావించి కుమార్తెపై కోపాన్ని పెంచుకున్నట్టు తెలుస్తోంది. ఇది చివరికి ఈ దారుణానికి దారితీసిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

**సంపాదన కాదు.. పరువే ప్రధాన కారణమా?**

రాధిక సంపాదిస్తున్న డబ్బు చూసి అసూయపడ్డ తండ్రే ఆమెను చంపాడన్న వాదన మొదట ప్రచారంలోకి వచ్చింది. కానీ, దీపక్ యాదవ్ నెలకు రూ. 17 లక్షల వరకు సంపాదిస్తున్నాడని, విలాసవంతమైన ఫామ్ హౌస్‌లు, అనేక ఆస్తులు ఉన్నాయన్న నిజాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఆర్థిక అంశం కాకుండా, పరువు, వ్యక్తిగత కోపం, కుటుంబంలో ఉన్న భిన్నాభిప్రాయాలే ఈ దారుణ హత్యకు దారి తీసినవని నిపుణులు భావిస్తున్నారు. పితృస్వామ్య భావజాలం, ఆధునిక భావాలున్న యువతి స్వాతంత్ర్యం పట్ల అసహనం ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పలువురు విశ్లేషిస్తున్నారు.

**హత్య అనంతరం తల్లిదండ్రుల వైఖరి**

హత్య జరిగిన సమయంలో ఇంట్లోనే ఉన్నప్పటికీ.. కుటుంబ సభ్యుల్లో ఎవరూ కూడా తక్షణ స్పందన చూపించలేదు. రాధిక తల్లి మంజు యాదవ్ పోలీసులు ప్రశ్నించగానే జ్వరమొచ్చిందని, తెలియదని చెప్పి నోరు విప్పేందుకు నిరాకరించింది. దీపక్ యాదవ్ మాత్రం తానే హత్య చేశానని ఒప్పుకున్నాడు. అతని వద్ద లైసెన్స్ 32 బోర్ రివాల్వర్ ఉండటం, అలాగే మానసిక స్థితిపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. తల్లి మౌనం వెనుక ఉన్న కారణాలు కూడా మిస్టరీగా మారాయి.

**రాష్ట్ర స్థాయి క్రీడాకారిణి.. దారుణాంతం**

రాధికా యాదవ్ రాష్ట్ర స్థాయిలో పలు టోర్నమెంట్లలో మెడల్స్ సాధించిన క్రీడాకారిణి. ఆమె విజయాలు కుటుంబానికి గర్వకారణంగా ఉండే సమయంలో ఇలా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికర విషయం. వంటగదిలో బ్రేక్ ఫాస్ట్ తయారు చేస్తుండగా తండ్రి వెనక నుంచి ఐదు రౌండ్లు కాల్పులు జరపడం ఘటన తీవ్రతను, ఉద్దేశపూర్వకతను స్పష్టం చేస్తుంది. ఆమె క్రీడా రంగంలో సాధించిన విజయాలను చూసి గర్వపడాల్సిన తండ్రే ఇలా అత్యంత దారుణంగా ఆమెను హతమార్చడం అందరినీ కలచివేస్తోంది.

ఇంత ఆర్థికంగా బలమైన కుటుంబంలో, ముద్దుల కూతుర్ని ప్రేమించిన తండ్రి

నుంచి అలాంటి దారుణ చర్య రావడం సమాజాన్ని ఆలోచనలో పడేసింది. ఒక యువతి స్వతంత్రంగా జీవించాలనే కోరికకు అడ్డుగా 'పరువు' అనే భ్రాంతి నిలవడమా? అన్న ప్రశ్న ప్రస్తుతం నలుమూలల నుంచీ వినిపిస్తోంది. ఈ ఘటన మహిళా భద్రత, కుటుంబ వ్యవస్థలో భావోద్వేగాల పాత్రపై సమాజం మళ్ళీ ఆలోచించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆధునిక సమాజంలోనూ పరువు పేరుతో జరిగే నేరాలు, ముఖ్యంగా కుటుంబసభ్యుల చేత జరిగే హింసపై తీవ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

# గిల్‌కు వన్డే కెప్టెన్సీ.. రోహిత్ శర్మను తప్పించడానికి కారణం ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ లో మరో సంచలన మార్పు బీసీసీఐ తీసుకోబోతున్నట్టు సమాచారం. టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ ను వన్డేల్లో కూడా సారధ్య బాధ్యతలు అప్పజెప్పనున్నట్టు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం టీమిండియా వన్డే కెప్టెన్ గా ఉంటున్న రోహిత్ శర్మ స్థానంలో గిల్ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకోనున్నాడు. రిపోర్ట్స్ ప్రకారం గిల్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఇద్దరు జర్నలిస్టులు పోస్టా పోస్ట్ చేయడం గురువారం (జూలై 10) సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టీమిండియా తదుపరి ఆడబోయే వన్డే సిరీస్ కు గిల్ టీమిండియా వన్డే కెప్టెన్ గా ఎంపికయ్యే అవకాశం ఉంది. టీమిండియా తమ తదుపరి వన్డే సిరీస్ ను అక్టోబర్ లో ఆస్ట్రేలియాపై ఆడనుంది. ఈ సిరీస్ నుంచి గిల్ కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలుస్తుంది. గిల్ భవిష్యత్ కెప్టెన్ గా కితాబులు అందుకుంటున్నాడు. టీ20 ఫార్మాట్ లోనూ ఈ టెస్ట్ కెప్టెన్ కు వైస్ కెప్టెన్సీ ఇవ్వనున్నట్టు సమాచారం. చివరిసారిగా రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంది. ఇప్పటికే టెస్ట్, టీ20 ఫార్మాట్ నుంచి దూరమైన హిట్ మ్యాన్ వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. మూడు ఫార్మాట్ లకు ముగ్గురు కెప్టెన్ లను కొనసాగడం బీసీసీఐ ఆలోచనల్లో లేనట్టు స్పష్టమవుతుంది.

**రోహిత్ తప్పించడానికి కారణం ఇదే!**

రోహిత్ శర్మ ప్రస్తుత వయసు 37 సంవత్సరాలు. 2027 వన్డే వరల్డ్ కప్ వరకు రోహిత్ శర్మ ఆడడం దాదాపుగా ఖాయమైంది. ఫిట్ నెస్ లో హిట్ మ్యాన్ కు సమస్యలు ఉన్నాయి. ఇటీవలే ఐపీఎల్ లో సైతం రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్ గా బరిలోకి దిగాడు. దీంతో పాటు ఇప్పటి నుంచే గిల్ కు కెప్టెన్ గా అవకాశమిస్తే 2027 వరల్డ్ కప్ లోపు అనుభవాన్ని సంపాదించుకుంటాడనే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం. భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని గిల్ కు టెస్ట్, వన్డే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# పంత్ స్థానంలో జురెల్ బ్యాటింగ్ చేయవచ్చా.. ఐసీసీ రూల్స్ ఏం చెబుతున్నాయంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న లార్డ్స్ టెస్టులో టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడ్డాడు. తొలి రోజు ఆటలో భాగంగా చేతి వేలికి గాయమైంది. దీంతో పంత్ గాయం కారణంగా గ్రౌండ్ వదిలి వెళ్ళిపోయాడు. బుమ్రా వేసిన 34 ఓవర్ రెండో డెలివరీ పంత్ ఎడమ చేతి వేలికి బలంగా తగిలింది. నొప్పితో విలవిల్లాడడంతో ఫిజియో వచ్చి స్ప్రేను తన చేతి వేలికి చల్లాడు. నొప్పి తగ్గకపోవడంతో పంత్ గ్రౌండ్ వదిలి వెళ్ళిపోయాడు. పంత్ స్థానంలో ధృవ్ జురెల్ వికెట్ కీపింగ్ చేయడానికి వచ్చాడు. రెండో రోజు పంత్ గాయం నుంచి కోలుకోకపోవడంతో వికెట్ కీపింగ్ చేయడానికి జురెల్ బరిలోకి దిగాడు. పంత్ గాయంపై ఎలాంటి అప్ డేట్ లేదు. రెండో రోజు టీమిండియా బ్యాటింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంత్ బ్యాటింగ్ ఆడకపోతే పరిస్థితి ఏంటి అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ పంత్ బ్యాటింగ్ చేయలేకపోతే అతని స్థానంలో వికెట్ కీపింగ్ చేస్తున్న ధృవ్ జురెల్ బ్యాటింగ్ చేయవచ్చా అనే ప్రశ్న ఎదురవుతుంది. ఐసీసీ రూల్స్ ప్రకారం పంత్ బ్యాటింగ్ చేయడానికి రాలేకపోతే అతని స్థానంలో జురెల్ బ్యాటింగ్ చేసే అవకాశం లేదు. ఐసీసీ ప్రస్తుత టెస్ట్ రూల్స్ ప్రకారం, ఒక ఆటగాడు కంకషన్ కు గురైనప్పుడు మాత్రమే ప్రత్యామ్నాయం ఆటగాడిని భర్తీ చేయగలడు. పంత్ గాయం అతని చేతికి సంబంధించింది. తలకు సంబంధించినది కాదు. కాబట్టి జురెల్ ఫీల్డింగ్ ప్రత్యామ్నాయం మాత్రమే. అతను కీపింగ్ చేయడానికి మాత్రమే ఉంటుంది. బ్యాటింగ్ చేయడానికి అర్హత లేదు. ఒకవేళ ఈ మ్యాచ్ లో పంత్ బ్యాటింగ్ కు రాకపోతే టీమిండియాపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తుంది. సూపర్ ఫామ్ లో ఉన్న పంత్ త్వరగా కోలుకోని బ్యాటింగ్ కు రావాలని టీమిండియా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. తొలి టెస్టులో రెండు సెంచరీలు కొట్టి అదరగొట్టిన పంత్ రెండో రెండో ఇన్నింగ్స్ లో హాఫ్ సెంచరీ చేసి రాణించాడు.

# దమ్ముంటే తిరుగు.. సెంచరీకి ముందు రూట్‌ను భయపెట్టిన జడేజా




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లాండ్ తొలి రోజును అద్భుతంగా ముగించింది. లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో రూట్ అజేయంగా 99 పరుగులు చేసి ఇంగ్లాండ్ ను పటిష్ట స్థితిలో ఉంచాడు. టీమిండియా బౌలర్లను సమర్ధవంతంగా అడ్డుకున్న రూట్.. 191 బంతుల్లో 9 ఫోర్లతో 99 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. తొలి రోజు ఆట ముగుస్తుందనుకున్న సమయంలో రూట్ సెంచరీ చేసే అవకాశం ఉన్నప్పటికీ.. జడేజా కారణంగా 99 పరుగుల వద్ద ఆగిపోయాడు. సరదాగా జడేజా చేసిన ఈ పని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తొలి రోజు ఆటలో భాగంగా ఆకాష్ దీప్ తన చివరి ఓవర్ వేశాడు. ఈ ఓవర్ కు ముందు రూట్ 96 తో క్రీజ్ లో ఉన్నాడు. రెండో బంతికీ రెండు పరుగులు తీసుకున్న రూట్ 98 పరుగులకు చేరుకున్నాడు. నాలుగో బంతికి థర్డ్ మ్యాన్ వైపు కొట్టి సింగిల్ పూర్తి చేసుకున్నాడు. రెండో పరుగు తీద్దామా.. వద్దా అనే ఆలోచనలో ఉన్నాడు. ఈ సమయంలో జడేజా బంతిని కింద పడేసి రూట్ వైపుగా చూస్తూ రన్ తిరుగు అని సైగలు చేశాడు. రూట్ తిరగాలనుకున్నప్పటికీ రిస్క్ ఎందుకు అని ఆగిపోయాడు. చివరి రెండు బంతులను స్టోక్స్ డిఫెన్స్ ఆడడంతో పరుగులేమీ రాలేదు. జడేజా చేసిన ఈ చిలిపి పనితో రూట్ తొలి రోజు 99 పరుగుల వద్ద నాటౌట్ గా మిగిలిపోయాడు.తొలి రోజు జరిగిన మ్యాచ్ విషయానికి వస్తే గురువారం మొదలైన మూడో టెస్ట్‌లో ఇంగ్లండ్‌కు శుభారంభం లభించింది. జో రూట్ (191 బాల్స్‌లో 9 ఫోర్లతో 99 బ్యాటింగ్), ఒలీ పోప్ (44) రాణించడంతో.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 251/4 స్కోరు చేసింది. రూట్‌తో పాటు బెన్ స్టోక్స్ (39 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. నితీశ్ రెడ్డి రెండు వికెట్లు తీశాడు. బుమ్రా, జడేజాలకు తలో వికెట్ దక్కింది.

# అనుష్క ఫస్ట్ లవ్ అతడే..



టాలీవుడ్‌లో సెన్సిబుల్ పెర్ఫార్మెన్స్, స్ట్రాంగ్ ఫీమేల్ రోల్స్‌తో సత్తా చాటిన నటి అనుష్క శెట్టి. బాహుబలి తర్వాత ఆమె క్రేజ్ దేశవ్యాప్తంగా విస్తరించింది. అంతకుముందే 'అరుంధతి', 'వేదం', 'భాగమతి' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుష్క.. బాహుబలి తర్వాత తన సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్త వహిస్తోంది. కమర్షియల్ సినిమాలకు దూరంగా ఉండి కంటెంట్‌కి ప్రాధాన్యతనిచ్చే కథలే ఎంచుకుంటోంది.

వాస్తవానికి అనుష్క లాంటి స్టార్ హీరోయిన్, క్రేజ్ ఉన్న సమయంలో వరుస సినిమాలు చేయవచ్చు. కానీ ఆమె మాత్రం స్క్రిప్ట్‌కి న్యాయం చేయగల పాత్రలకే ఓకే చెబుతోంది. అందుకే గత కొన్నేళ్లలో ఆమె చేసిన సినిమాల సంఖ్య తక్కువైనా, ప్రతి ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలిచింది. ఇటీవలే పూర్తయిన 'ఘాటీ' సినిమా కూడా వైవిధ్యభరితమైన కథతో రూపొందినట్లు సమాచారం. ఇది విడుదలకు సిద్ధంగా ఉంది. ఇదిలా ఉండగా, అనుష్క తన వ్యక్తిగత జీవితంలో అరుదుగా స్పందిస్తుంటుంది. అయితే గతంలో ఓ ఇంటర్వ్యూలో తన ఫస్ట్ లవ్ గురించి చెప్పింది. ఇక ఇప్పుడు అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "ఆరో తరగతి చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ఓ బాలుడు వచ్చి నాకు 'ఐ లవ్ యూ' అన్నాడు. అప్పుడు ఆ మాట అర్థం కాకపోయినా, ఏదో కొత్త ఫీలింగ్ కలిగింది. నేనూ సరిగ్గా తెలియకపోయినా 'ఓకే' చెప్పాను. అది చిన్న విషయమే కానీ, ఇప్పటికీ ఆ జ్ఞాపకం మధురంగా మిగిలిపోయింది" అంటూ అనుష్క చెప్పిన ఈ విషయంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు.

ఈ మాటలతో అనుష్కలోని అమాయకత్వం, నిజాయితీ బయటపడింది. స్టార్ స్టేటస్ ఉన్నప్పటికీ చిన్నప్పటి ప్రేమ జ్ఞాపకాన్ని ఈ విధంగా పంచుకోవడం అభిమానులకు ఆసక్తికరంగా అనిపించింది. "అనుష్క ఎప్పటికీ పాజిటివ్ పర్సనాలిటీ" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన 'ఘాటీ' సినిమాపై బాగానే అంచనాలున్నాయి. ఇది ఆమె నటనకు మరో సవాల్‌గా మారనుందని తెలుస్తోంది. గతంలో 'నిశ్శబ్దం'లో మ్యూట్ క్యారెక్టర్‌లో నటించి విమర్శకుల ప్రశంసలు పొందిన అనుష్క, ఈసారి 'ఘాటీ'లో మరో డిఫరెంట్ షేడ్ చూపించబోతున్నట్లు చిత్రబృందం అంటోంది. ఈ సినిమా విడుదల తర్వాత ఆమె తదుపరి ప్రాజెక్ట్‌లు కూడా క్రమంగా ప్రకటించే అవకాశం ఉంది.



వర్షం కురిసినా, నివేదా పేతురాజ్ ఉల్లాసంగా ఉంచుతుంది



మిమీ చక్రవర్తి కొత్త క్యాండిడ్ ఫ్రేమ్ కేవలం విస్మయం కలిగిస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com